# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 304 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 9 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 304 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 9 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ పెన్ పవర్:: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరినీ సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ మొత్తానికి ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది.

- మిగతా 2లో

## జగన్ సిద్ధాంతాన్ని పాటిస్తున్న కేసీఆర్

### ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకపోవడం ఏ రాష్ట్రంలోనూ లేదు

### విలేకరులతో ఇష్టాగోష్ఠిలో మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్ పెన్ పవర్: అసెంబ్లీకి హాజరుకారాదనే ఏపీ మాజీ సీఎం జగన్ సిద్ధాంతాన్నే కేసీఆర్ పాటిస్తున్నట్లు అనిపిస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. 'ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుండా ఫాంహౌస్‌లో ఉండడం దేశంలో ఎక్కడా లేదు. దళితవర్గానికి చెందిన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అధ్యక్షా అని పిలవాల్సి వస్తుందని అసెంబ్లీకి రావడం లేదు' అని విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "తొమ్మిదిన్నరేళ్ల భారాస పాలనలో కేసీఆర్ ఎప్పుడూ అంబేడ్కర్‌కు దండ వేయలేదు. భారాస సభ్యులు ఇప్పుడు స్పీకర్‌ను అవమానిస్తే కనీసం

- మిగతా 2లో

# సీఎం రేవంత్‌రెడ్డిది క్రిమినల్ మనస్తత్వం

- పోలీసు ఎస్కార్టుతో కేసీఆర్ ఇంటిపైకి కాంగ్రెస్ గూండాలను పంపిన ప్రభుత్వం
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజం
- బోయిన్‌పల్లి ఠాణా వద్ద భారాస, కాంగ్రెస్ నేతల పరస్పర దాడులతో ఉద్రిక్తత





హైదరాబాద్ పెన్ పవర్: క్రిమినల్ మనస్తత్వం కలిగిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ నాయకులు కౌశిక్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, విజయుడులతో కలిసి మంగళవారం కేటీఆర్ ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా పోలీసులు వారిని హకీంపేట్ వద్ద అరెస్టు చేసి బోయిన్‌పల్లి ఠాణాకు తరలించారు. తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు స్పీకర్‌ను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ స్పీకర్ బాధపడి ఉంటే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటానని ఎమ్మెల్సీ తాతా మధు ఇప్పటికే మీడియాకు స్పష్టం చేశారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై దాడి అత్యంత హేయమైన చర్య. కేసీఆర్ ఇంటిపైకి ప్రభుత్వం పోలీసు ఎస్కార్టుతో కాంగ్రెస్ గూండాలను పంపింది. కేసీఆర్ మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యాఖ్యలు చేయడం దారుణం. రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు పోరాడినందుకా..? రైతుబంధు ద్వారా 70 లక్షల మంది రైతులకు అండగా నిలిచినందుకా..? కేసీఆర్ ఎందుకు మరణించాలో చెప్పాలి.

- మిగతా 2లో

## తెలంగాణ మండలిలో హైటెన్షన్..


## ఎమ్మెల్సీ తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

- తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత
- మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ తాతా మధును అడ్డుకున్న మార్షల్స్
- వెళ్లేందుకు నిరాకరించడంతో బలవంతంగా ఎత్తుకెళ్లి బయటకు తరలింపు
- స్పీకర్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకున్న అధికారులు



తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని

- మిగతా 2లో




## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

## దరఖాస్తు గడువు పెంపు

- తెలంగాణ పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు
- సెప్టెంబర్ 16 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం
- మొత్తం 7,437 పోస్టుల భర్తీకి జూలై 29న నోటిఫికేషన్
- ఇప్పటివరకు 2.88 లక్షల మంది దరఖాస్తు ప్రక్రియ పూర్తి
- చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు రావొచ్చని బోర్డు సూచన

- మిగతా 2లో

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం




- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

పెన్ పవర్ డెస్క్:గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు.

- మిగతా 2లో

## యూరియా కలిసిన దాణా తిని 18 ఆవుల మృత్యువాత



పెన్ పవర్ డెస్క్: యూరియా కలిసిన దాణా తినడంతో ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గోశాలలో చోటుచేసుకుంది. ఓ రైతు నిల్వ చేసిన బస్తాల్లోని యూరియా వర్షానికి కరిగి గోవుల దాణాలో కలిసింది. మంగళవారం ఉదయం ఆ దాణా తినడంతో 18 ఆవులు మృతిచెందాయి.

- మిగతా 2లో

## తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

- తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు
- ప్రధాన నిందితుల్లో ఒకరికి మరణశిక్ష విధింపు
- మరో ఇద్దరికి 20 ఏళ్లు, 13 ఏళ్ల జైలుశిక్ష
- 2022లో మైనర్‌పై పెళ్లి పేరుతో అత్యాచారానికి పాల్పడిన నిందితులు

- మిగతా 2లో



## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్న రాజు మృతి చెందారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో


- మిగతా 2లో



## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

పెన్ పవర్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్ ( తో భేటీ కానున్నారు. ఈ నెల 12-13 తేదీలలో దిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### సమావేశాలు.. వాయిదానే... ప్రజా సమస్యలు మాత్రం పక్కకే

తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అత్యంత వేడిగా మరియు ఆసక్తికరంగానే ఉంటాయి. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ఇక్కడి రాజకీయ ముఖచిత్రం నిరంతరం మారుతూనే ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఒకింత సాఫీగా జరిగిన రాజకీయాలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం హాట్ గా సాగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరగడం కంటే రభస ఎక్కువగా వినిపిస్తుంది. అనుకోని సంఘటనలతో సభా సమయం వృధా అవుతుంది. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చల కంటే అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రమైన రభస, వాగ్వాదాలకే వేదికయ్యాయి. ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను పక్కనబెట్టి వ్యక్తిగత దూషణలు, రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల వివాదంతో...**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి చేసినట్లుగా చెప్తున్న అనుచిత వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారం రేపాయి. సభ ప్రారంభమయిన మొదటి రోజే నలుపు రంగు దుస్తులు ధరించి సభలోకి బీఆర్ఎస్ సభ్యులు ప్రవేశించడాన్ని అడ్డుకున్న పోలీసులపై బీఆర్ఎస్ సభ్యులు దాడికి పాల్పడ్డారని అధికార పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేసింది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు సభ్యుడిని సభ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.మరొకవైపు అసెంబ్లీ వెలుపల నల్ల టీ షర్టులు ధరించి నిరసన తెలపడానికి ప్రయత్నించిన కేటీఆర్, హరీష్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. మహిళా శాసనసభ్యులను పోలీసులు అవమానించారంటూ బీఆర్ఎస్ ఆరోపించింది

**ప్రజా సమస్యలను చర్చించకుండా...**

22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై సభలో చర్చ జరుగుతుందని, ప్రభుత్వం నుంచి సమాధానం వస్తుందని ప్రజలు సహజంగా ఆశిస్తారు. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22(ఏ) కింద నిషేధిత భూముల జాబితాపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చర్చించాలని బీజేపీ మరియు ఇతర ప్రతిపక్షాలు సభలో నిరసనలకు దిగడంతో తొలిరోజే సభ వాయిదా పడింది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన కేవలం వైఫల్యాలమయమని ప్రతిపక్షాలు విమర్శిస్తుండగా, గత ప్రభుత్వ తప్పులను ఎండగట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అధికార పక్షం కౌంటర్ ఇస్తోంది. సభలో ప్రజల పక్షాన నిలబడి నిరుద్యోగం, రైతుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కీలకమైన విషయాలపై లోతైన చర్చలు జరగాల్సిన సమయంలో, సభా సమయం అంతా నినాదాలు, నిరసనలు, మరియు రాజకీయ వ్యూహాలకే పరిమితమవ్వడం పట్ల సామాన్య ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరొకవైపు ఆందోళనలు, అరెస్ట్ లతోనే సభా సమయం గడిచి పోతుంది. సభ వాయిదా పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# సీఎం రేవంత్‌రెడ్డిది క్రిమినల్ మనస్తత్వం

- మొదటి పేజి తరువాయి

**ఎమ్మెల్సీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులా?**

వంద రోజుల్లో 420 హామీలను నెరవేరుస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు వెయ్యి రోజులైనా వాటిని నెరవేర్చలేక పోయినందుకు నిరసన తెలుపుతున్న మాపై ఇలాంటి దాడులు చేయడం ఏమిటి? ఎమ్మెల్సీలను అరెస్టు చేయడం, బహిష్కరించడం ద్వారా వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్సీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు అభ్యంతరకరం.

బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద పరస్పర దాడులు చేసుకుంటున్న భారాస, కాంగ్రెస్ కార్యకర్తలు

**సాగర్ ఆయకట్టుకు నీటి షెడ్యూల్ ప్రకటించాలి**

తెలంగాణ నీటిని ఆంధ్రాకు తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి షెడ్యూల్ ప్రకటించాలి. కేసీఆర్ హయాంలో 510 అడుగుల నీటిమట్టం వద్ద కూడా సాగర్ నుంచి నీటిని అందించారు. ఇప్పుడు నీటిమట్టం 530 అడుగులున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని ఎందుకు విడుదల చేయడంలేదు? నిషేధిత జాబితాలో కోటి ఎకరాల భూములు, విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలపై అసెంబ్లీలో చర్చించాలి. బోయిన్‌పల్లి ఠాణాలో ఉన్న మాపై కాంగ్రెస్ గూండాలతో దాడి చేయించే ప్రయత్నం చేశారు" అని కేటీఆర్ అన్నారు.

**రణరంగాన్ని తలపించేలా..**

ఎర్రవల్లికి వెళ్తున్న కేటీఆర్, భారాస నేతలను బోయిన్‌పల్లి ఠాణాకు తీసుకువస్తున్నారని తెలుసుకున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, అనిత, నళినీకిరణ్, మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తదితరులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కేటీఆర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు టి.పద్మారావుగౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ కూడా ఠాణాకు వచ్చి కేటీఆర్‌కు సంఘీభావం తెలిపారు. కేటీఆర్.. ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి స్టేషన్‌లో భోజనం చేసిన కొద్దిసేపటికే.. కాంగ్రెస్ పార్టీ నేతలు కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో పోలీస్‌స్టేషన్ వైపు దూసుకొచ్చారు. అప్పటికే అక్కడ గుమిగూడిన భారాస నాయకులు, కార్యకర్తలు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను నిలువరించేందుకు పోలీసులు యత్నించినా ఫలితంలేకపోయింది. పరస్పరం కుర్చీలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. పోలీసులు రెండు పార్టీల నేతలను చెదరగొట్టారు. ఈ క్రమంలోనే భారాస నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ నేతలపై దాడి చేశారు. ఈ ఘటనలో కాంగ్రెస్ పార్టీ నేతలు మారుతీగౌడ్, ఫరానా, ఆదిల్, రాజు తదితరులకు గాయాలయ్యాయి. పోలీసులు కాంగ్రెస్ పార్టీ నేతలను ఓ పక్కకు తీసుకెళ్తుండగా భారాస నేతలు ఠాణా ఎదురుగా ఉన్న ఎన్‌హెచ్-44పై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు విడుదల చేసిన అనంతరం కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు అక్కడి నుంచి అసెంబ్లీకి వెళ్లడంతో పరిస్థితులు సద్దుమణిగాయి. కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు రావడంపై బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజును వివరణ కోరగా క్షేత్రస్థాయిలో ఏమి జరిగిందనే విషయమై సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు.

# జగన్ సిద్ధాంతాన్ని పాటిస్తున్న కేసీఆర్

- మొదటి పేజి తరువాయి

ఖండించలేదు. దళిత వర్గానికి చెందిన రాజయ్యను మంత్రివర్గం నుంచి నాడు ఆయన బర్తరఫ్ చేశారు. భారాస అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రతిపక్ష నేత హోదా పదవి నుంచి భట్టి విక్రమార్కను తొలగించారు. ఎమ్మెల్సీ మధు మాట్లాడింది భారాస స్క్రిప్ట్. ఆ పార్టీ నేతలు వ్యూహం పన్ని ఆయన్ను పంపారు. అందుకే ఆయన వ్యాఖ్యలను కేసీఆర్ ఖండించలేదు.

**త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు ఖరారు**

కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యలు చేశారా లేదా అనేది నేను వినలేదు. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏను సమూలంగా సమీక్షించి, సవరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అనుకుంటున్నారు. నేను కూడా సీఎంకు అదే సూచించా. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల వడపోత జరిగింది. నల్గొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గాన్ని భట్టి విక్రమార్క;

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యే అవకాశం ఉంది. ఒక్కోదానికి నాలుగేసి పేర్లు పరిశీలించాం. రెండోసారి వివాదం తలెత్తినప్పుడు సమస్యను సామరస్యంగా ముగించాలని కొండా సురేఖకు చెప్పా. నేను మంత్రి కావాలని కోరుకోలేదు. మంత్రి పదవి కోసం నన్ను ఇంతవరకు ఎవరూ అడగలేదు" అని అన్నారు.

# తెలంగాణ మండలిలో హైటెన్షన్..

## ఎమ్మెల్సీ తాతా మధును లాక్కెళ్లిన మార్షల్స్

- మొదటి పేజి తరువాయి

మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు ఎమ్మెల్సీ తాతా మధు ప్రయత్నించారు. అయితే, ఆయనపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడినందున, మండలి ఆవరణలో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు.అయినప్పటికీ, అధికారుల సూచనను తిరస్కరించిన తాతా మధు, అక్కడే ఉండేందుకు ప్రయత్నించారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఆయన

నిరాకరించడంతో, మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధుపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, మండలి ప్రాంగణంలో ఆయనను మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నారు.

## తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

# దరఖాస్తు గడువు పెంపు

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.

ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు

ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- మొదటి పేజి తరువాయి

తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా ద

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# తిరునల్వేలి గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన తీర్పు.. దోషికి ఉరిశిక్ష

మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన కేసులో తమిళనాడులోని తిరునల్వేలి పోక్సో ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఒక దోషికి మరణశిక్ష విధిస్తూ, మరో ఇద్దరికి కఠిన కారాగార శిక్షలను ఖరారు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, 2022లో తిరునల్వేలికి చెందిన 16 ఏళ్ల బాలికకు ఓ ప్రార్థనా స్థలంలో విలాతికుళానికి చెందిన పెయింటర్ మునీశ్వరన్ (25) పరిచయమయ్యాడు. ఫోన్ నంబర్లు మార్చుకున్నాక వారిద్దరూ సుమారు రెండు వారాల పాటు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన మునీశ్వరన్, సదరు బాలికను తన ద్విచక్ర వాహనంపై మీనాక్షిపురంలోని తన సోదరి నివాసానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం మునీశ్వరన్ తన స్నేహితులైన చిన్నకుట్టి (28), మురుగేశన్ (23)లను అక్కడికి పిలిపించాడు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, వారు కూడా బాలికపై లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ దారుణం గురించి బాధితురాలు తన తల్లిదండ్రులకు తెలపడంతో, వారు పాళయంకోట్టై మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సురేశ్ కుమార్ మంగళవారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు చిన్నకుట్టికి మరణశిక్ష విధించగా, మురుగేశన్‌కు 20 ఏళ్లు, మునీశ్వరన్‌కు 13 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

- మొదటి పేజి తరువాయి

మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళల ఎదుట అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనలకు అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.

## అసెంబ్లీ ఆవరణలో కుప్పకూలిన ఐఏఎస్ నవీన్ మిట్టల్ పర్సనల్ సెక్రటరీ రాజు మృతి

- మొదటి పేజి తరువాయి

ఉదయం అసెంబ్లీ ఆవరణలో అకస్మాత్తుగా కుప్పకూలారు. రాజు కుప్పకూలడాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి ఆయనకు సీపీఆర్ చేశారు.అనంతరం చికిత్స నిమిత్తం రాజును ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలోనే రాజు మృతి చెందడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. రాజు మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## సెప్టెంబరు 11న మోదీ-పుతిన్ భేటీ

- మొదటి పేజి తరువాయి

ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు.

ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశం లో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో అణు సహకారంపై దృష్టి..**

రష్యా-భారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు.

# ‘సర్’లో ఆధారాల గందరగోళం..! ఓటర్లలో ఆందోళన..!

## -అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగించొద్దని స్థానికుల విజ్ఞప్తి..

- అర్హుల ఓట్లకు ‘ఎస్ఐఆర్’ ఉచ్చు..? సూరారంలో నిరసన..!
- పత్రాలు లేవని ఓటు తీసేస్తారా..?
- ఎస్ఐఆర్‌పై సూరారం ప్రజల గళం..!
- ఓటు హక్కు కాపాడాలని డిమాండ్.. ప్లకార్డులు పట్టుకుని ధర్నా..
- ఎస్ఐఆర్‌లో పారదర్శకత ఏదీ..? అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు..
- పేదలు, నిరక్షరాస్యులు, వలస కార్మికుల వద్ద పత్రాలు లేకుంటే పరిస్థితి..?
- ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలని కోరారుతున్న స్థానికులు..
- కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదాలకు ఓటర్లను బాధ్యులను చేయొద్దని స్పష్టం..
- ఆధార్, రేషన్ కార్డు తదితర పత్రాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు..

-4 లో




# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

- “దుండిగల్-బౌరంపేట్” గ్రామాల పెద్ద చెరువులు అధికారులతో కలిసి సందర్శన..
- నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశం..
- క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయాలను సూచన..
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలక ఆదేశం..
- చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..
- నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచన..



దుండిగల్ పెద్ద చెరువు వద్ద దుండిగల్ సర్కిల్ అధికారులతో జెడ్‌సి..


దుండిగల్ విలేజ్ పెద్దచెరువు సందర్శించిన జోనల్ కమిషనర్.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లు...పకడ్బందీగా చేపట్టాలి

## కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ పరిశీలన..

**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** గణేష్ నిమజ్జన కార్యక్రమాలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ పెద్ద చెరువు, బౌరంపేట్ పెద్ద చెరువులను ఆయన మంగళవారం సందర్శించి గణేష్ నిమజ్జనానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతాల్లో భక్తులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిమజ్జన సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రద్దీ నియంత్రణ, భద్రత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు..

**క్రేన్లు, లైటింగ్, బారికేడింగ్‌పై ప్రత్యేక దృష్టి..**

గణేష్ విగ్రహాల నిమజ్జనం సులభంగా జరిగేలా అవసరమైన క్రేన్లను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో రాత్రివేళ కూడా తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా, ప్రమాదాలకు తావులేకుండా బారికేడింగ్‌ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవిధంగా చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయిన అనంతరం కూడా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు..





### నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి..

నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని జోనల్ కమిషనర్ స్పష్టం చేశారు.నిర్ణీత గడువులోగా అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతో పాటు నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ పేర్కొన్నారు.. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, ఏఎంసీ లక్ష్మయ్యతో పాటు సర్కిల్ సిబ్బంది, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు..



బౌరంపేట్ పెద్దచెరువు వద్ద జోనల్ కమిషనర్..

# రేషన్ కార్డుదారులకు ‘ఇ-కేవైసి’ డెడ్‌లైన్..! సెప్టెంబర్ 30 చివరి తేదీ..!




### రేషన్ దుకాణాలకు కలెక్టర్ కీలక ఆదేశాలు..

ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇంకా వేలాది మంది ‘ఇ-కేవైసి’ పూర్తి చేయకపోవడంపై అధికారులు దృష్టి ప్రత్యేక సారించారు.. ‘ఇ-కేవైసి’ పూర్తి చేయని 5,07,614 మంది సభ్యులు ఎలాంటి జాప్యం చేయకుండా సెప్టెంబర్ 30లోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అన్ని రేషన్ షాపుల డీలర్లు సెప్టెంబర్ నెలాఖరు వరకు దుకాణాలను తెరిచి ఉంచి, ‘ఇ-కేవైసి’ కోసం వచ్చే కార్డుదారులకు అవసరమైన సహకారం అందించాలని పౌర సరఫరాల శాఖ ఆదేశించింది..

## జిల్లాలో 5.07 లక్షల మంది ‘ఇ-కేవైసి’ ఇంకా పెండింగ్..

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 17.55 లక్షల మందికి మాత్రమే ‘ఇ-కేవైసి’ పూర్తి..!
- రేషన్ షాపుల్లోనూ ఇ-కేవైసి చేసుకునే అవకాశం..
- ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరి..
- వాట్సాప్ ద్వారా మొబైల్ నంబర్ అప్డేట్ చేసుకునే వెసులుబాటు..
- నెలాఖరు వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలని ఆదేశాలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 9:** రేషన్ కార్డు లబ్ధిదారులు ‘ఇ-కేవైసి’ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ (పౌర సరఫరాలు) సూచించారు. జిల్లాలో మొత్తం 22,62,797 మంది రేషన్ కార్డు సభ్యులు ఉండగా, ఇప్పటివరకు 17,55,183 మంది వ-ఖ్జ పూర్తి చేశారు. మరో 5,07,614 మంది సభ్యులు ఇ-కేవైసి పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 30, 2026లోగా పూర్తి చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.. ‘ఇ-కేవైసి’ కోసం లబ్ధిదారులు సమీపంలోని రేషన్ షాప్ (ఎఫ్‌పిఎస్)ను సందర్శించి ఆధార్ ఆధారిత ధృవీకరణ పూర్తి చేసుకోవచ్చు. రేషన్ దుకాణాల్లోని ‘ఇ-పోస్’ పరికరాల ద్వారా మొబైల్ నంబర్ సీడింగ్, ధృవీకరణ చేపట్టనున్నారు.. అదేవిధంగా ‘అన్న సహాయత’ ద్వారా 9868200445 నెంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేసి మొబైల్ నెంబర్‌ను అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించారు. రేషన్ కార్డు నెంబర్, ఆధార్ చివరి నాలుగు అంకెలు, ప్రస్తుత మొబైల్ నంబర్ నమోదు చేసి ‘అప్‌డేట్ నెంబర్’ ద్వారా కొత్త నెంబర్‌ను నమోదు చేయవచ్చు. ఓటిపి ధృవీకరణ అనంతరం మొబైల్ నంబర్ అప్డేట్ అవుతుంది.. అయితే వాట్సాప్ ద్వారా నెంబర్ అప్‌డేట్ చేసిన అనంతరం సమీప రేషన్ షాపులో జరిగే తదుపరి బయోమెట్రిక్ లావాదేవీ సమయంలో మరోసారి ఓటిపి ధృవీకరణ ద్వారా మొబైల్ నంబర్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు..

# ఎర్రవల్లి రణరంగం

- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- నిలువరించేందుకు తరలివచ్చిన భారాస శ్రేణులు
- పరస్పర దాడులు.. పలువురికి గాయాలు
- ఇరువర్గాలను ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు



-4 లో





సూరారం కాలనీలో నిరసన తెలియజేస్తున్న స్థానికులు..

- అర్హుల ఓట్లకు 'ఎస్ఐఆర్' ఉచ్చు..? సూరారంలో నిరసన..!
- పత్రాలు లేవని ఓటు తీసేస్తారా..?
- ఎస్ఐఆర్‌పై సూరారం ప్రజల గళం..!
- ఓటు హక్కు కాపాడాలని డిమాండ్.. ప్లకార్డులు పట్టుకుని ధర్నా..
- ఎస్ఐఆర్‌లో పారదర్శకత ఏదీ..? అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు..
- పేదలు, నిరక్షరాస్యులు, వలస కార్మికుల వద్ద పత్రాలు లేకుంటే పరిస్థితి..?
- ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలని కోరారుతున్న స్థానికులు..
- కంప్యూటర్ ఆపరేటర్ల తప్పిదాలకు ఓటర్లను బాధ్యులను చేయొద్దని స్పష్టం..
- ఆధార్, రేషన్ కార్డు తదితర పత్రాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు..

# 'సర్'లో ఆధారాల గందరగోళం..!

# ఓటర్లలో ఆందోళన..!

## అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగించొద్దని స్థానికుల విజ్ఞప్తి..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని, సరైన ఆధారాలు లేవన్న కారణంతో ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించవద్దని డిమాండ్ చేస్తూ మంగళవారం సూరారం కాలనీలో ధర్నా నిర్వహించారు. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ భవన్ ఎదుట ఈ ఆందోళన చేపట్టారు.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓటర్లకు నోటీసులు అందుతుండటంప్రజల్లో ఆందోళన నెలకొందని గోగులపాటి కృష్ణమోహన్ అన్నారు. ముఖ్యంగా పేదలు, నిరక్షరాస్యులు, సొంత ఇళ్లు లేని వారు, వలస కార్మికులు తమ వద్ద అవసరమైన అన్ని పత్రాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు..పత్రాలు లేవన్న కారణంతో అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకూడదు.. అధికారిక డేటా నమోదు సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ల వల్ల జరిగే పొరపాట్లకు ఓటర్లను బాధ్యులను చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు..

### స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని విజ్ఞప్తి..

కాగా 1987కు ముందు నాటి అధికారిక పత్రాలను తప్పనిసరిగా కోరుతున్నట్లయితే, ప్రస్తుతం 50--60 ఏళ్ల లోపు ఉన్న అనేక మందికి అలాంటి పత్రాలు అందుబాటులో ఉండే అవకాశం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.. ఆధార్, రేషన్ కార్డు తదితరపత్రాలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని, వివరాల్లో తప్పులు ఉన్న ఓటర్లకు సరిదిద్దుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు..ఓటరు పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం ఇచ్చి, తన వాదన వినిపించుకునే అవకాశం తప్పనిసరిగా కల్పించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పేదలుసామాన్య ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ధర్నాలో పాల్గొన్న వారు డిమాండ్ చేశారు.


నిరసన ధర్నాలో గోగులపాటి కృష్ణమోహన్..

# ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు..

- గుండె ఆరోగ్యం, పక్షవాతం పునరావాసంలో ఫిజియోథెరపీ కీలకం..
- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఫిజియోథెరపిస్టుల సేవలు ఎనలేనివి..!




**మేడ్చల్, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కండ్లకోయ సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజియోథెరపీ విభాగంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, శారీరక దృఢత్వం, చురుకుదనం, స్వతంత్ర జీవనంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర ఎంతో కీలకమని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ సంస్థ హృదయ సంబంధ వ్యాధులు, పక్షవాతం (స్ట్రోక్) నివారణ, నిర్వహణ, పునరావాసంలో ఫిజియోథెరపీ పాత్రపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.. ఫిజియోథెరపీ ద్వారా శారీరక సమస్యలు, గాయాలు, దీర్ఘకాలిక నొప్పుల నుంచి కోలుకోవడంతో పాటు రోగులు సాధారణ జీవనానికి తిరిగి రావడానికి అవసరమైన పునరావాసాన్ని అందించవచ్చని వివరించారు. ముఖ్యంగా కార్డియోవాస్కులర్ వ్యాధులు, స్ట్రోక్‌కు గురైన వారికి ఫిజియోథెరపీ సేవలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు.. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ రంగంలో తమ అనుభవాలను నిపుణులు విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం సైంటిఫిక్ సెషన్స్, పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్ పోటీ, అనాటమీ ఆర్ట్, 3డీ ఆర్ట్ తదితర కార్యక్రమాలను నిర్వహించారు..ఈ కార్యక్రమంలో సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ గోపాల్ రెడ్డి, డీన్ డీటీ వెంకట రమణయ్య, ప్రిన్సిపాల్ నరహరి శెట్టి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎర్రవల్లి రణరంగం

**హైదరాబాద్ పెన్ పవర్:** డప్పు చప్పుళ్లు.. పోటాపోటీ నిరసనలు.. పరస్పర దాడులతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి. శాసనసభాపతిపై భారాస ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి చేపట్టింది. ఉమ్మడి మెదక్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని నాలుగువైపులా నుంచి డప్పుల మోతతో వచ్చి ముట్టడించేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్యలు ఫాంహౌస్ వైపు వస్తున్నారనే ప్రచారంతో.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సికింద్రాబాద్ సమీప బొల్లారం చౌరస్తా నుంచి పాదయాత్రగా బయలుదేరగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. కాంగ్రెస్ శ్రేణులను నిలువరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారాస శ్రేణులు రావడానికి ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు.



### నలువైపుల నుంచి ముట్టడికి యత్నాలు

ఫాంహౌస్‌కు వెళ్లే నాలుగు దారులు ఎర్రవల్లి, వరదరాజ్‌పూర్, దామెరకుంట, రాజీవ్ రహదారి ద్వారా కాంగ్రెస్ శ్రేణులు ముట్టడికి బయల్దేరాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డిల నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ వద్ద హరిత హోటల్ వద్దకు చేరుకున్నాయి. డప్పులతో వచ్చిన కార్యకర్తలతో కలిసి జగదేవ్‌పూర్ వెళ్లే దారిగుండా అలీరాజ్‌పేట??, ఇటిక్యాల మీదుగా వరదరాజ్‌పూర్ చేరుకున్నారు. ఇక్కడ ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు కలిశారు. అడుగడుగునా బారికేడ్లు, రోప్ పార్టీలను దాటుకొని వ్యవసాయక్షేత్రం మలుపు వద్ద చేరుకొని లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. గంటపాటు పోలీసులతో కాంగ్రెస్ కార్యకర్తలు తోపులాటకు దిగారు. మరో మార్గమైన దామెరకుంట మీదుగా కేసీఆర్ ఫాంహౌస్‌ను ముట్టడించేందుకు ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. గణేశ్‌పల్లి నుంచి నర్సన్నపేట మీదుగా హుస్నాబాద్, సిద్దిపేట, మానకొండూరు, దుబ్బాకకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బస్సుల్లో వచ్చారు. ఎర్రవల్లి గ్రామంలోని పాఠశాల వద్ద పోలీసులు నిలిపివేశారు.

### నర్సారెడ్డిని పరామర్శించిన మంత్రులు

వరదరాజ్‌పూర్ చౌరస్తా, దామెరకుంటలలో కాంగ్రెస్, భారాస కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. రెండు పార్టీల్లోనూ పలువురికి గాయాలయ్యాయి. హస్తం నేతల వాహనాలపై రాళ్ల దాడులు జరిగాయి. కాంగ్రెస్ నేతల రాకతో తమ గ్రామం అపరిశుభ్రంగా మారిందని వరదరాజ్‌పూర్‌లో భారాస నేతలు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారు. సింగాయపల్లి చౌరస్తా వద్ద భారాస గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రతాప్‌రెడ్డి పెద్దసంఖ్యలో కార్యకర్తలతో కలిసి రోడ్డుపై బైఠాయించి పోలీసులు, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఎర్రవల్లి, పరిసర గ్రామాలతో పాటు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తోపులాటలో పోలీసులకు సైతం స్వల్పగాయాలయ్యాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి గాయపడగా నిమ్స్‌కు తరలించారు. అక్కడ నర్సారెడ్డినిని మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పరామర్శించారు.





# మంత్రోపదేశంతో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ..!

- హైదరాబాద్‌లో ఘనంగా కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం..
- రెండు రోజుల పాటు ఘనంగా కొనసాగిన ఆధ్యాత్మిక సమ్మేళనం..
- కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై శిక్షణ..
- తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు..
- అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజతో భక్తి వాతావరణం..
- రెండో రోజు అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణ..
- గురూజీతో ముఖాముఖి, సందేహ నివృత్తి, గురు పాదపూజ..

హైదరాబాద్, పెన్ పవర్, సెప్టెంబర్ 8:

కేరళ సంప్రదాయ తాంత్రిక విధానంలో అయ్యప్ప స్వామి పూజా విధానాలను పరిచయం చేయడంతో పాటు, భక్తులు మరియు సాధకులకు ఆధ్యాత్మిక సాధన, పూజా ప్రక్రియలపై ప్రాయోగిక అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన కేరళ తాంత్రిక అయ్యప్ప పూజా సమ్మేళనం ఘనంగా జరిగింది.. గుండ్లపోచంపల్లిలోని ఏవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో సెప్టెంబర్ 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సమ్మేళనానికి అయ్యప్ప భక్తులు, సాధకులు, పూజా విధానాలను అభ్యసిస్తున్న పలువురు హాజరయ్యారు. కె. నిరంజన్ రావు గురూజీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేరళలోని చెంగన్నూర్‌కు చెందిన మంత్ర విద్యా పీఠం వ్యవస్థాపకులు, తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు..



## తొలిరోజు ప్రాయోగిక శిక్షణ..

సెప్టెంబర్ 6న ప్రారంభమైన కార్యక్రమంలో కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలపై సాధకులకు ప్రాయోగిక శిక్షణ అందించారు. గురు ఆగమనం, గురు వందనంతో కార్యక్రమాలు ప్రారంభమై, వివిధ పూజా ప్రక్రియలపై ప్రత్యేక ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు..ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిక్షణలో భాగంగా అష్టాదశ కలశ పూజ, అయ్యప్ప పడి పూజలను కేరళ తాంత్రిక సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం జరిగిన అయ్యప్ప భజన సంధ్యతో కార్యక్రమ ప్రాంగణం భక్తి వాతావరణాన్ని సంతరించుకుంది. భజనలు, ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలతో పాటు భక్తులు, అతిథులను సత్కరించారు..

## గురూజీతో ముఖాముఖి..

రెండో రోజు సాయంత్రం గురూజీతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా సాధకులకు గురూజీతో వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం కల్పించారు.. ఆధ్యాత్మిక సాధన, పూజా విధానాలు, ప్రత్యేక సందర్భాల్లో అనుసరించాల్సిన పూజా మార్గాలు, అయ్యప్ప పడి పూజకు సంబంధించిన అంశాలపై సాధకులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు..




## మంత్రోపదేశ మహోత్సవం..

సెప్టెంబర్ 7న జరిగిన రెండో రోజు కార్యక్రమానికి అయ్యప్ప మంత్రోపదేశ మహోత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తంత్ర గురువు బ్రహ్మశ్రీ టి.డి.పి. నంబూద్రి గురూజీ ఆధ్వర్యంలో మంత్రోపదేశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గురు పాద పూజ, సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. పాల్గొన్న సాధకులు, ప్రముఖులకు జ్ఞాపికలను అందజేశారు..



## సాధకులకు ప్రత్యేక వేదిక..

కేరళ తాంత్రిక సంప్రదాయంలో అయ్యప్ప పూజా విధానాలను అధ్యయనం చేయాలనుకునే సాధకులకు ఇలాంటి సమ్మేళనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా నేర్చుకోవడం -- సాధన చేయడం -- అనుభవించడం -- గురు ఆశీస్సులు పొందడం అనే విధానంలో కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.. ప్రత్యక్ష ప్రాయోగిక శిక్షణ, పూజా విధానాల అభ్యాసం, మంత్రోపదేశం, గురు మార్గదర్శకత్వంతో ఈ రెండు రోజుల సమ్మేళనం ఆధ్యాత్మికంగా విశేషంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.



# గెస్ట్ ఫ్యాకల్టీ పై లైంగిక దాడి

# హైదరాబాద్ జేఎన్టీయూలో దారుణం

**హైదరాబాద్ సెప్టెంబర్ 8, పెన్ పవర్:**
ప్రొఫెసర్ అంటే ఉద్యోగం కాదు.. అది ఒక పవిత్రమైన బాధ్యత. రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే యువతకు పాఠాలు చెప్పి.. మార్గదర్శనం చేయాల్సిన స్థానంలో ఉన్న ఒక వ్యక్తి.. ఇంతటి నీచమైన పనులకు పాల్పడటం క్షమించరాని నేరం. విద్యాబుద్ధులు నేర్పే ఆలయం లాంటి విశ్వవిద్యాలయంలో ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవడం.. యావత్ మానవత్వానికే సిగ్గుచేటు. హైదరాబాద్‌లోని ప్రముఖ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ లో జరిగిన ఒక ఘటన విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చింది.జేఎన్‌టీయూలో పనిచేసే ఒక ప్రొఫెసర్, అదే యూనివర్సిటీలో ఉన్న ఒక గెస్ట్ ఫ్యాకల్టీ మహిళపై దారుణానికి ఒడిగట్టాడు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారమని నమ్మించి.. మొదట బాధితురాలిని తన బుట్టలో వేసుకున్నాడు. ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టాడు.

ఆ ప్రొఫెసర్.. నిన్ను ఉద్యోగం నుంచి తీసేస్తాను అంటూ నిత్యం బెదిరింపులకు పాల్పడుతూ.. ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. భయంతో ఆమె ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయింది. పని ఉందనే సాకుతో బాధితురాలిని అర్ధరాత్రి వరకు తన ఛాంబర్‌లో ఉంచుకోవడం.. దీనివల్ల ఆమె భార్యాభర్తల మధ్య విభేదాలు రావడం.. చివరకు ఆ ప్రొఫెసర్ ఆమె కాపురాన్ని కూడా కూల్చేయడం జరిగింది.ఒంటరిగా ఉంటున్న బాధితురాలి నిస్సహాయతను అవకాశంగా మలుచుకున్న ఆ కీచక ప్రొఫెసర్, శారీరకంగా.. మానసికంగా మరింతగా వేధించాడు. రోజురోజుకూ ప్రొఫెసర్ వేధింపులు పెరిగిపోవడంతో.. వాటిని తట్టుకోలేకపోయిన బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ఆఖరికి ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించగా.. కేపీహెచ్‌బీ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.జీఎన్టీయూ లాంటి విద్యా సంస్థలో ఇలాంటి ఘటన జరగడంతో.. అక్కడ చదువుతున్న విద్యార్థులు.. పనిచేస్తున్న ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొఫెసర్ వృత్తికి మచ్చ తెచ్చిన ఈ నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా ఉండాలంటే.. విద్యా సంస్థల్లో మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

# కిలోలకుపైగా బంగారం.. 335 కిలోల వెండితో గణనాధుడు

**ముంబై సెప్టెంబర్ 8, పెన్ పవర్:**
విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. భక్తుల కోరికలను తీర్చే గణనాథుడు.. గణేశోత్సవం వచ్చిందంటే దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి మొదలవుతుంది. ముఖ్యంగా ముంబైలో జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భక్తి, సంప్రదాయం, సేవ, వైభవం కలగలిసిన గణపతి ఉత్సవాలు ప్రతి ఏటా లక్షలాది మందిని ఆకర్షిస్తాయి. అలాంటి విశిష్ట గణపతి ఉత్సవాల్లో ముంబైలోని కింగ్స్ సర్కిల్‌లో ఉన్న జీఎస్ బీసేవా మండల్ మహాగణపతి ఉత్సవం ఒకటి. ఈ ఏడాది 72వ గణేశోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండల్ సిద్ధమైంది. ఈసారి మహాగణపతికి ఏకంగా రూ.703.27 కోట్ల భారీ బీమా రక్షణ కల్పించారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఉత్సవాలకు సంబంధించిన విలువైన వస్తువులు, భక్తుల రాకపోకలు తదితర అంశాలకు ఈ బీమా రక్షణ కల్పిస్తోంది.మహాగణపతి విగ్రహానికి ఈ ఏడాది 66 కిలోలకుపైగా బంగారు ఆభరణాలు, 335 కిలోలకుపైగా వెండి ఆభరణాలు అలంకరించనున్నట్లు సమాచారం. వీటికి తోడు విలువైన రత్నాలు కూడా గణనాథుడి అలంకరణలో భాగం కానున్నాయి. ఈ ఆభరణాల్లో చాలా వరకు భక్తులు, సేవాదారులు సంవత్సరాలుగా స్వామివారికి సమర్పించినవే. భక్తుల విశ్వాసానికి ప్రతీకలుగా నిలిచిన ఈ ఆభరణాలు ప్రతి సంవత్సరం మహాగణపతి అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో ఈ ఆభరణాల విలువ కూడా గణనీయంగా పెరిగింది. దాంతో గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి బీమా విలువ కూడా భారీగా పెరిగింది.2024లో సుమారు రూ.400 కోట్ల బీమా ఉండగా, 2025లో అది రూ.474 కోట్లకు చేరింది. ఇప్పుడు 2026లో ఏకంగా రూ.703.27 కోట్లకు పెరగడం గణపతి ఉత్సవ వైభవాన్ని తెలియజేస్తోంది.ముంబైలో 1951లో +ూదీ సేవా మండల్ ఏర్పాటైంది. 1955లో గణేశోత్సవ వేడుకలను ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా మహాగణపతి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాది మహాగణపతి తొలి ప్రజా దర్శనాన్ని 'విరాట్ దర్శన్' పేరుతో సెప్టెంబర్ 12న రాత్రి 8 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రధాన ఐదు రోజుల గణేశోత్సవం సెప్టెంబర్ 14 నుంచి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు గణనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చే అవకాశం ఉంది.

లక్షకు పైగా పూజలు.. ప్రతిరోజూ 40 వేల మందికి అన్నదానంసేవా మండల్ ఉత్సవం కేవలం బంగారు ఆభరణాలు, భారీ అలంకరణలతో మాత్రమే ప్రత్యేకం కాదు. భక్తి, సేవ, అన్నదానం ఈ ఉత్సవంలో ప్రధాన భాగాలు. ఈ ఐదు రోజులలో భక్తులు, సేవాదారుల ద్వారా లక్షకు పైగా పూజలు, సేవలు నిర్వహించబడతాయని మండల్ అంచనా వేస్తోంది. అదేవిధంగా ప్రతిరోజూ సుమారు 40 వేల మందికి ప్రసాద భోజనం అందించేందుకు అన్నదాన సేవను నిర్వహించనున్నారు. అంటే ఐదు రోజులలో కలిపి రెండు లక్షల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందే అవకాశం ఉంది. 'అన్నదానం మహాదానం' అనే భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ఇది ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది.ఈ ఏడాది ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. మహాగణపతి విగ్రహాన్ని పూర్తిగా పర్యావరణహితంగా రూపొందించనున్నారు. అంతేకాకుండా పూజలు, సేవలు, విరాళాలకు సంబంధించి గతంలో ఉపయోగించే ముద్రిత రసీదులను నిలిపివేసి డిజిటల్ రసీదుల విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను కూడా గుర్తుచేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం.ముంబై +ూదీ సేవా మండల్ మహాగణపతి ఉత్సవం కేవలం ఒక భారీ ఉత్సవం మాత్రమే కాదు. భక్తుల విశ్వాసం, తరతరాల సంప్రదాయం, దైవ సేవ, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ.. ఇవన్నీ కలిసిన ఒక ఆధ్యాత్మిక వేడుక. బంగారు, వెండి ఆభరణాలతో మహాగణపతి అలంకారం ఎంత వైభవంగా కనిపించినా.. భక్తులకు అన్నదానం చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలే ఈ ఉత్సవానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తాయి.

# ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్ధశ

**నల్గొండ, సెప్టెంబర్ 8, పెన్ పవర్:**
తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్-సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి

1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

# కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతిపెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా



బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమేనని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు.రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం చేసుకోవడం, ఇతర పార్టీల నుంచి సీనియర్ నేతలను ఆకర్షించడం మరియు ఓటర్లలో నమ్మకాన్ని కలిగించేలా ఏకీకృత నాయకత్వాన్ని తీసుకురావడం తక్షణ అవసరం. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, సానుభూతి రాజకీయాలను పక్కనబెట్టి అగ్రెసివ్ అప్రోచ్‌తో ముందుకు వెళ్తేనే తెలంగాణలో కమలం వికసించే అవకాశాలు మెరుగవుతాయి

## తాతాపై చర్యల దిశగా అడుగులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 ,పెన్ పవర్:** తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభ వేళ అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చేపట్టిన నిరసన ప్రదర్శన ఉద్రిక్తతకు దారి తీసింది. నల్లచొక్కాల నిరసనలు, సెక్యూరిటీతో తోపులాటల నడుమ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వ్యవహరించిన తీరు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. అసెంబ్లీ గేటు వద్ద భద్రతా సిబ్బంది ఆంక్షలను నిరసించే క్రమంలో ఆయన ఏకంగా సభాపతి వ్యవస్థను , పోలీసు యంత్రాంగాన్ని ఉద్దేశించి మీడియా మైకుల ముందే అనుచిత, ఘోరమైన వ్యాఖ్యలు చేయడం సభా హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందనే చర్చ మొదలైంది.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుంది, కానీ అత్యున్నతమైన స్పీకర్ పీఠాన్ని లక్ష్యంగా చేసుకుని గీత దాటి ప్రవర్తించడం రాజకీయంగా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. అనుభవం ఉన్న ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రత్యక్ష ప్రసారాల్లోనే స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా తాతా మధు కాంగ్రెస్ ప్రభుత్వానికి స్వయంగా ఆయుధాన్ని అందించినట్లయింది. ప్రతిపక్షం దూకుడు ప్రదర్శించడంలో తప్పు లేకపోయినా, రాజ్యాంగబద్ధ పదవుల పట్ల ఉండాల్సిన కనీస గౌరవాన్ని విస్మరించడం వల్ల వచ్చిన అవకాశాన్ని అధికార పక్షం రాజకీయంగా వాడుకోవడానికి సిద్ధపడింది.ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. సభా గౌరవాన్ని, స్పీకర్ వ్యవస్థ ప్రాధాన్యతను దిగజార్చేలా మాట్లాడిన ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అత్యవసర సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ఖరారు చేశారు. ఈ క్రమంలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వడం లేదా ప్రివిలేజ్ కమిటీకి ఈ వ్యవహారాన్ని బదిలీ చేసి మండలి నుంచి ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.ప్రతిపక్ష సభా బహిష్కరణలు, గేట్ల వద్ద ధర్నాల వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి తాతా మధు చేసిన వ్యాఖ్యలు బలమైన రాజకీయ అస్త్రంగా మారాయి. చట్టసభలను, స్పీకర్ పీఠాన్ని బీఆర్ఎస్ నేతలు ఏ స్థాయిలో అవమానిస్తున్నారో ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ కౌంటర్ నెరేటివ్‌ను సిద్ధం చేస్తోంది.

## ట్రాన్స్ జెండర్ల ఆగడాలకు చెక్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో శుభకార్యాలు జరుగుతున్న ఇళ్లపై కొందరు ట్రాన్స్‌జెండర్ల పేరుతో చేస్తున్న దాడిపై తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమ వసూళ్లు , బెదిరింపుల దందాపై తెలంగాణ పోలీస్ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇటీవల చింతల్ ప్రాంతంలో జరిగిన ఒక గృహప్రవేశ కార్యక్రమంలో రూ.50,000 నగదు డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్న ఘటన కలకలం రేపింది. ఈ క్రమంలో బాధితుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, శాపనార్థాలు పెట్టడంపై తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి బలవంతపు వసూళ్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ డ్రైవ్ నిర్వహించాలని ఆయన పోలీసు కమిషనర్లను ఆదేశించారు.సెప్టెంబర్ 4న చింతల్‌లోని తమ నూతన గృహంలోకి అడుగుపెడుతున్న ఒక కుటుంబాన్ని కొందరు ట్రాన్స్‌జెండర్లు అడ్డుకున్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చుకోలేమని ఆ కుటుంబం వేడుకున్నప్పటికీ, వారు వినిపించుకోకుండా తీవ్ర పదజాలంతో దూషించారు. సామాజిక మాధ్యమాల్లో బాధితులు పంచుకున్న ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసుల రక్షణ పై ప్రశ్నలు రేకెత్తించింది. ఈ తరహా ఉదంతాలపై ఫిర్యాదులు పెరగడంతో, గతంలో తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రత్యేక అణచివేత చర్యలను రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ పునరావృతం చేయాలని డీజీపీ అధికారులకు స్పష్టం చేశారు.పోలీసు చర్యలు కేవలం అక్రమ దందాలు, బెదిరింపులకు పాల్పడే నేరపూరిత ముఠాల పైనే ఉంటాయని, ఇవి మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. నగరంలో ఇప్పటికే పలువురు ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుతంగా ఉద్యోగాలు చేస్తూ సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ చర్యలను వాడుకుంటూ గౌరవంగా జీవించే వారిని, దందాలు , భయానక వసూళ్లకు పాల్పడే ముఠాలను వేర్వేరుగా చూస్తామని పోలీస్ యంత్రాంగం తేల్చిచెప్పింది. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లోని కమిషనరేట్లు, ఎస్పీ కార్యాలయాల పరిధిలో నిఘా పెంచి, ఇటువంటి బలవంతపు వసూళ్ల ముఠాలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. శుభకార్యాలు చేసుకునే సామాన్య ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# కేసీఆర్ రాజీనామా చుట్టూ రాజకీయాలు

**మెదక్, సెప్టెంబర్ 8, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా డిమాండ్ చుట్టూ భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్న కేసీఆర్.. ఎమ్మెల్యే పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని అధికార కాంగ్రెస్ ముప్పేట దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ అంతే దీటుగా ప్రతిదాడికి దిగుతోంది. ఒకవైపు శాసనసభ సంప్రదాయాలు, నైతిక బాధ్యతల పేరిట కాంగ్రెస్ ఒత్తిడి పెంచుతుంటే, మరోవైపు దీనిని రాజకీయ ప్రతీకారంగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. మొత్తంగా కేసీఆర్ హాజరు అంశం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రణరంగాన్ని సృష్టించింది.ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి సభకు రాకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యానికే అవమానమని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ప్రజల సమస్యలను చట్టసభలో లేవనెత్తాల్సిన బాధ్యతను విస్మరిస్తూ, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని అధికార పక్షం తేల్చి చెబుతోంది. అసెంబ్లీ గేటు తొక్కకుండా ప్రజాధనంతో వచ్చే జీతభత్యాలు, సదుపాయాలు అనుభవించడం సిగ్గుచేటని మంత్రులు నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. పదేళ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తికి అసెంబ్లీలో కూర్చోవడానికి అహం అడ్డొస్తోందా అని కాంగ్రెస్ నిలదీస్తోంది. ప్రతిపక్ష నేత హోదా దక్కించుకుని కూడా సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోతే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది.కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం వెనుక ఉన్న కారణాలను రాజకీయంగా, భావోద్వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. సీఎం స్థాయి వ్యక్తి కేసీఆర్ చావును కోరుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి మాట్లాడే వ్యక్తులు ఉన్న సభలోకి వెళ్లి మాటలు పడాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. సభలో చర్చల కంటే వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపులే లక్ష్యంగా మారినప్పుడు అక్కడకు వెళ్లడం ఆత్మగౌరవానికి భంగకరమని వాదిస్తున్నారు. కేసీఆర్ మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతారని బీఆర్ఎస్ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. గతంలో తమిళనాడు రాజకీయాల్లో ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజాలు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా అధికార పక్షం వైఖరిని నిరసిస్తూ సభను బహిష్కరించిన సందర్భాలను బీఆర్ఎస్ గుర్తుచేస్తోంది. అప్పుడు ప్రజాక్షేత్రంలో తేల్చుకుని తిరిగి అధికారంలోకి వచ్చినట్లే, కేసీఆర్ కూడా ప్రజల వద్దకే వెళ్తారని స్పష్టం చేస్తోంది.ఈ వివాదం వెనుక ఉభయపక్షాల వ్యూహాత్మక రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్‌ను సభకు రప్పించడం ద్వారా ఆయన వైఫల్యాలను, గత పదేళ్ల పాలనను నేరుగా ఎండగట్టవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఒకవేళ ఆయన రాకపోతే పారిపోయారన్న ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను నైతికంగా బలహీనపరచాలని అధికార పార్టీ చూస్తోంది. గజ్వేల్‌లో ఉపఎన్నిక వస్తే కేసీఆర్‌ను రాజకీయంగా మరింత దెబ్బతీయవచ్చనే ఆలోచన కూడా కాంగ్రెస్ వ్యూహాల్లో భాగంగా కనిపిస్తోంది.మరోవైపు బీఆర్ఎస్, కేసీఆర్ భద్రత, కాంగ్రెస్ నేతల అనుచిత వ్యాఖ్యలను ప్రజల్లో ప్రధాన చర్చనీయాంశంగా మార్చాలని యోచిస్తోంది. సభకు వెళ్లకపోవడాన్ని ప్రజా ఆత్మగౌరవ పోరాటంగా చిత్రీకరిస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ రాజీనామా డిమాండ్ ద్వారా తమ అధినేతను వేధిస్తోందన్న భావనను కేడర్‌లోకి బలంగా తీసుకెళ్లి, సానుభూతి కూడగట్టడమే లక్ష్యంగా గులాబీ దళం పావులు కదుపుతోంది.మొత్తంగా కేసీఆర్ అసెంబ్లీ హాజరు, రాజీనామా వ్యవహారం కేవలం ఒక నియమ నిబంధనల అంశం మాత్రమే కాదు. ఇది రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పైచేయి సాధించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న హైవోల్టేజ్ మైండ్ గేమ్‌గా మారింది.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** విద్యార్థులకు క్రీడలు ఎంతగానో అవసరమని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతీ హతిరాం నాయక్ ఎంఈఓ మంకిడి వీరభద్రరావు లు అన్నారు. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కబడ్డీ వాలీబాల్ కోకో మండల స్థాయి ఎంపిక క్రీడా పోటీలను గార్ల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బాలుర క్రీడా మైదానంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం నిర్వహించిన ఆటల పోటీలో స్వయంగా వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవిద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికిమానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష్య సాధన దిశగా నిరంతరం శ్రమించాలని అందుకు చదువుతో పాటుగా క్రీడలపై దృష్టి సారించి క్రీడల్లో రాణించి, జాతీయ స్థాయికి ఎదగి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు సాధించాలనిఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్. వివిధ గ్రామాల సర్పంచులువిశ్రాంత ఉపాధ్యాయులు శివ నాయక్.పీఈటీలు శ్రీను పద్మ శంకర్ హరి శేఖర్ నాగేశ్వరరావు బుచ్చ టీచర్లు పి వెంకట్ రెడ్డి అబ్దుల్లా, మోకాళ్ళ రామచంద్రు, మంగీలాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా క్రీడ పోటీలు సత్తా చాటిన విశ్వశాంతి విద్యార్థులు



ఆడుతున్న క్రీడాకారులు



గెలిచిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**మండల స్థాయి క్రీడా పోటీల్లో విశ్వశాంతి విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు. గార్ల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో విశ్వశాంతి విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.జూనియర్స్ బాలికల కబడ్డీ విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీలో విశ్వశాంతి విద్యాలయం జట్టు అద్భుత ఆటతీరుతో ప్రత్యర్థి జట్టును అధిగమించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అదే ఉత్సాహంతో సీనియర్స్ బాలికల విభాగంలోనూ పోరాడి ద్వితీయ స్థానంలో నిలిచింది.రెండు విభాగాల్లోనూ విద్యార్థినులు కనబరిచిన క్రీడా ప్రతిభకు ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు అభినందనలు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విజేత విద్యార్థినులను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# బీఆర్ఎస్ నాయకుల వినూత్న నిరసన



నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు హేయమైన చర్య అని మాజీ జెడ్పిటిసి చైర్పర్సన్ ఆంగోత్ బిందు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పై బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూ గార్ల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన ఎన్నికల హామీలను అమలు చేయలేదన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లలో అనేకం నేటికీ అమలు కాలేదని విమర్శించారు. రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్లు, తులం బంగారం, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు చేసినా బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గబోవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని, ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందనిపేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ మాజీ ఎంపిటిసి శీలంశెట్టి రమేష్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాధాకృష్ణ అనిల్ శ్రీనాథ్ మహేష్ ఉమేష్ చంటి ఆజాద్ నరసింహ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఎల్బీనగర్‌లో మహిళల ఆగ్రహం





- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరును ఖండిస్తూ భారీ ధర్నా
- కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వీర్లపల్లి శంకరయ్య దిష్టిబొమ్మ దహనం

**ఎల్బీనగర్, పెన్ పవర్ సెప్టెంబర్ 8:** కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణిని నిరసిస్తూ ఎల్బీనగర్ మహిళల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై వీర్లపల్లి శంకరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మహిళలు మండిపడ్డారు. "ప్రజా పాలన పేరుతో ప్రజల మనోభావాలను అణచివేయడం సరికాదు" అని మహిళలు పేర్కొన్నారు. 420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని వారు హెచ్చరించారు. ఎవరి ప్రోద్బలంతో కాకుండా స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలు ర్యాలీగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఏసీపీ, సీఐలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మనాయక్, మల్లీశ్వరిరెడ్డి, రంగేశ్వరి నాయుడు, శైలజ, రమాదేవి, విజయ, అంజలి, లత, దేవి, మమత, శిల్పారెడ్డి, వాణి, సూరజ్ ఎస్తాని, కల్పన, లక్ష్మి, పార్వతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 8:** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం కూసుమంచి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో ఘనంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్య ప్రాధాన్యతను, అక్షరాస్యత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థులు వివిధ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అక్షరాస్యతతోనే సమాజంలో చైతన్యం, అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులు నినాదాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ రాయల వీరస్వామి మాట్లాడుతూ అక్షరాస్యత ప్రతిఒక్కరి జీవితంలో ఎంతో కీలకమైందని అన్నారు. విద్యతో వ్యక్తిలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ కుటుంబంతో పాటు సమాజంలోని ఇతరులకు కూడా విద్య ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ముఖ్యంగా నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు విద్య విలువను ఇతరులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ ఏపీఎం, సీసీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




అక్షరాస్య దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న కూసుమంచి హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

# సందడిగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కేక్ కటింగ్ చేసి సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 8:**జననేత ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య జన్మదినం సందర్భంగా తమ అభిమానాన్ని చాటుతూ పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు తొలుత గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజా ప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం రోగులకు పండ్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వడ్లమూడి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జననేత బడుగు బలహీన వర్గాల బాంధవుడు పార్టీ శ్రేణుల గుండెల్లో తనకంటూ ఒక సుస్థిర స్థానం సంపాదించుకొని ఇల్లందు నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో జనహృదయనేతగా రాజకీయ రంగంలో మరింత ఎత్తుకు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు. తాళ్ల పెల్లి కృష్ణ గౌడ్ గార్ల సర్పంచ్ బానోత్ పార్వతి హతిరం నాయక్ ఉప సర్పంచ్ జెరినా బేగం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగావత్ రామ్ సింగ్ ప్రధాన కార్యదర్శి భూక్యరామ్ సింగ్ సర్పంచులు మోతిలాల్ వీర్య నాయక్ వీరన్న వెంకట్రావు దేవి సుశీల సరోజా ప్రమీల వీరభద్రం ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల కుమార్ లెనిన్ ప్రశాంత్ మోహిన్ వార్డు మెంబర్ తోడేటి శ్రీనివాస్ సారయ్య అర్జున కిషన్ యాకుబ్ పాషా ఇనుగుర్తి వెంకటరెడ్డి శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# అధినేతలు కాదంటున్నా.. కామన్ గా కూటమి కార్యకర్తల కొట్లాట?



**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి పార్టీల మధ్య సమన్వయం కత్తిమీద సాములా మారుతోందని టాక్ వినిపిస్తోంది. కూటమిలోని మూడు పార్టీలు ఉండగా, టీడీపీ–జనసేన మధ్య అవగాహన కొరవడుతోందన్న టాక్ రెండు పార్టీల అగ్రనేతలకు టెన్షన్ పెడుతోందని అంటున్నారు. కూటమిగా కలిసివుంటామని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నా ఇరువైపులా కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు, ప్రతివిమర్శలతో పొలిటికల్ టెంపరేచర్ పెంచేస్తున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రెండు పార్టీల కార్యకర్తల ఆవేశంతో ప్రస్తుత రాజకీయాలకు సంబంధం లేని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, జనసేనాని పవన్ సోదరుడు మెగాస్టార్ చిరంజీవిని మధ్యలోకి లాగుతున్నారని చెబుతున్నారు.

స్థానిక ఎన్నికల ముందు కూటమిలో ఏ పార్టీ ఎక్కడి నుంచి పోటీ చేయాలి? ఎవరెవరిని బరిలోకి దింపాలనే ప్రధాన చర్చ జరగాల్సివుండగా, ప్రస్తుతం రెండు పార్టీల సోషల్ మీడియా బృందాలు మీ ఎమ్మెల్యే పనిచేయలేదంటే.. మీ ఎమ్మెల్యే పనిచేయడం లేదంటూ పరస్పరం ఆరోపణలు చేసుకోవడం హాట్ టాపిక్ అవుతోంది. దీనికి కొనసాగింపుగా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మెగాస్టార్ చిరంజీవి సినిమాలు, ఇతర వ్యవహారాలపైనా సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. ప్రధానంగా ఇటీవల నరసాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించిన సందర్భంగా అక్కడి జనసేన ఎమ్మెల్యే నాయకర్ పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించిన తర్వాత ఈ వివాదాలు ఎక్కువ అయ్యాయని పరిశీలకులు చెబుతున్నారు.ప్రభుత్వ ఆధినేతగా చంద్రబాబు అధికార కూటమి ఎమ్మెల్యేల పనితీరుపై కామెంట్లు చేయడాన్ని అవకాశంగా తీసుకుని కొందరు అగ్గిరాజేసే ప్రయత్నం చేస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సీఎం నరసాపురం పర్యటన తర్వాత గతంలో జనసేనలో పనిచేసిన ఓ నాయకుడు సోషల్ మీడియాలో సీఎం ప్రశ్నించడాన్ని తప్పుబట్టేలా పోస్టింగ్ చేయడంతో ఇరుపార్టీల మధ్య రచ్చ

ఎక్కువైందని అంటున్నారు. కూటమిలో చిచ్చు రాజేసేలా ఉద్దేశపూర్వకంగానే ఆ పోస్టు చేశారని టీడీపీ కార్యకర్తలు విమర్శలు చేస్తుండగా, జనసేన అభిమానిగా ఆ మాజీ నేత చేసిన పోస్టింగును జనసైనికులు సమర్థిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇరుపార్టీల మధ్య ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా పెద్ద యుద్ధమే నడుస్తోందని చెబుతున్నారు. వాస్తవానికి ఇరుపార్టీల అగ్రనాయకులు కూటమి ఎమ్మెల్యేల పనితీరు విషయంలో పార్టీలకు అతీతంగా వ్యాఖ్యలు చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా మంత్రి అనిత పనితీరును తప్పుబట్టారని కానీ అప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పలేదని అంటున్నారు. కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు జనసేన ఎమ్మెల్యే విషయంలో కామెంట్స్ చేయడాన్ని వేలెత్తిచూపడమే రాజకీయ వివాదంగా మార్చాలని చూస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ విషయం గమనించకుండా ఇరుపార్టీల కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించుకుంటుండటంతో కూటమి ఐక్యతపై ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానిస్తున్నారు.

# ఓటు వేయలేదని వదిలేయరు.. టీడీపీ తారకమంత్రం




**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు సహా 2029లో జరిగే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎలా వ్యవహరించాలి.. ఏ విధంగా ముందుకు సాగాలి..? అనే విషయాలపై టీడీపీ అధినేత చంద్రబాబు కీలక దిశానిర్దేశం చేస్తున్నారు. పార్టీ లీడర్ షిప్ కాన్క్లేవ్‌లో ఆయన నాయకులకు పలు అంశాలపై సూచన లు, సలహాలతో పాటు ఎలా వ్యవహరించాలన్న అంశాన్ని కూడా బోధిస్తున్నారు. ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు.. తమ పరిధిలోని ప్రజలతో వ్యవహరించిన తీరుపై చంద్రబాబు దృష్టి పెట్టారు. సహజంగానే కొన్ని మండలాల్లో టీడీపీ బలంగా ఉంటే.. మరికొన్ని చోట్ల వైసీపీ బలంగా ఉంది. అయితే.. టీడీపీ బలంగా ఉన్న చోటకంటే.. కూడా తమకు ఓటు వేయని వైసీపీకి బలంగా ఉన్న మండలాల పైనా దృష్టి సారించాలన్నది చంద్రబాబు చెప్పిన తారక మంత్రం. "అందరినీ కలుపుకొని పోతేనే ఎన్నికల్లో విజయం దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది. మీరు ఒకవైపే చూడడం సరికాదు. ఓటు వేశారా.. లేదా అనేదికాదు.. ఎందుకు వేయలేదో ఆలోచించాలి." అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.అలా ఓటు వేయకపోవడానికి, ఇన్నేళ్లయినా.. టీడీపీ వైపు వారు చూడకపోవడానికి కారణాలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని చంద్రబాబు చెప్పారు. అంటే.. ఓటు వేయలేదని వదిలేయ కుండా.. వారిని తక్కువ చేసి చూడకుండా.. నాయకులు తమ లోపాలను సరిచేసుకుని.. అందరికీ అక్కు న చేర్చుకునేలా రాజకీయాలు ముందుకు సాగాలని చంద్రబాబు తేల్చి చెప్పారు. త ద్వారా ఓటు బ్యాంకుతో పాటు ప్రజల్లోనూ నాయకుల పట్ల సానుకూలత పెరుగుతుందన్నారు. ఇక, వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి కలిసి కట్టుగానే పోటీ చేస్తుందని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. సర్దుబాట్లు ఎంపికల విషయాన్ని పార్టీనే చూస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో నాయకుల పనితీరు ఆధారంగా.. పార్టీకోసం.. ప్రభుత్వం కోసం పనిచేసిన వారినే ఎంపిక చేయనున్నట్టు వివరించారు. ప్రతి విషయంలోనూ పారదర్శకంగా ఉన్న నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ విషయంలో లాబీయింగ్‌లు పనిచేయబోవన్నారు.

# ఫించన్ల పండుగకు బృహత్తర అడుగు



**ఒంగోలు సెప్టెంబర్ 8, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి మరో బృహత్తర అడుగు వేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా దేశంలోనే అత్యధికంగా 62 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ పేదల పండుగ ను నిర్వహిస్తున్న ప్రభుత్వం, తాజాగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించింది. సాంకేతిక , ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు , ఇతర వృత్తుల వారికోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో అందుబాటులో ఉండే నిర్దేశిత ఫారాల ద్వారా అర్హులందరూ తమ పత్రాలను సమర్పించవచ్చని అధికార యంత్రాంగం వెల్లడించింది.అర్హుల ఎంపికలో ఎలాంటి జాప్యానికి, అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన, స్పష్టమైన సమయ పట్టికను ఖరారు చేసింది. సెప్టెంబర్ 7--16 మధ్య ఈ–కేవైసీ, ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక, సెప్టెంబర్ 17--21 వరకు సాధారణ అర్హత పరిశీలన చేపడతారు. అనంతరం సెప్టెంబర్ 22--24 తేదీలలో భౌతిక , శాఖాపరమైన క్షేత్రస్థాయి ధృవీకరణ పూర్తి చేసి, సెప్టెంబర్ 25--26 తేదీల్లో సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. ఈ ప్రక్రియ ముగిశాక అర్హులైన అందరికీ దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. వివిధ కేటగిరీలకు అవసరమైన ఆధార్, రైస్ కార్డ్, సదరమ్ , ఆయా సంబంధిత శాఖల ధృవపత్రాలను జతచేసి అక్నాలెడ్జ్‌మెంట్ పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.ప్రస్తుతం ప్రతి నెలా రూ.2,694 కోట్ల వ్యయంతో జనాభాలో 12.88 శాతం మందికి నెలకు రూ.4,000 నుంచి గరిష్టంగా రూ.15,000 వరకు భరోసా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2026 సెప్టెంబర్ 1 వరకు కేవలం పింఛన్ల కోసమే ఏకంగా రూ.73,508 కోట్లు ఖర్చు చేయడం, సంక్షేమం పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. వృద్ధులు, దివ్యాంగులతో పాటు చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు సహా దాదాపు 28 రకాల ప్రత్యేక కేటగిరీలకు పింఛన్లు ఇస్తూ ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నారు.గతంలో పింఛను పొందాలంటే సచివాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, ఊహాజనిత కారణాలతో కోతలు విధించడం వంటి పరిణామాలు ఉండేవి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణంగా ముందుకు సాగుతోంది. కొత్త దరఖాస్తుల స్వీకరణ ద్వారా క్షేత్రస్థాయిలో అసలైన నిరుపేదలకు, బాధితులకు 100 శాతం సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

సర్కార్ శుభవార్త

కొత్త ఫించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఏపీ సర్కార్ శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఫించన్లు అందించేందు సిద్ధమైంది. ఈమేరకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామ వార్డు, సచివాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను తీసుకోనుంది. మీ ఈ ఫించన్ ఎవరికి వస్తుంది. దీనికి అర్హులు ఎవరి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, దరఖాస్తు చేయడానికి ఏం ఏం పత్రాలు కావాలో ఇక్కడ తెలుసుకుందాం.కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నేటి నుంచి వారం రోజుల పాటు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 174 ప్రకారమే లబ్ధిదారుల అర్హతను గుర్తించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తున్నలు పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి కేటగిరీల వారీగా ఫించన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపింది. ఈ దరఖాస్తు ప్రక్రియను నేటి నుంచి స్టార్ట్ చేసి 20 రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత అర్హులైన వారికి వచ్చే నెల ఒకటి నుంచి ఫించన్లు అందించనున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ దరఖాస్తు ప్రక్రియ కొనసాగనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే చీ+ూఔ వెబ్‌సైట్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు తమ దరఖాస్తు పత్రాన్ని సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి ఇవ్వాలి.. అతను మీ అప్లికేసన్‌లో అన్‌లైన్‌లో ఎంట్రీ చేసి తర్వాత మీరు మళ్లీ ఓ రసీదు ఇస్తారు. తర్వాత మీ అప్లికేషన్లోని వివరాలను ఈకేవైసీ డేటాతో మ్యాచ్ అయితే మీ అప్లికేషన్ తర్వాత దశకు వెళ్తోంది. అలేదంటే మీ దరఖాస్తున్న ఉన్న సమస్యను తెలియజేసి సరైన డాక్యుమెంట్స్‌ను మళ్లీ సబ్‌మిట్ చేయాలని చెప్తారు.మీరు ఫించన్‌ను అప్ల చేయాలంటే కావాల్సిన పత్రాలుఆధార్, రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్

వితంతు ఫించన్ కోసమైతే.. లబ్ధిదారు భర్త డెత్ సర్టిఫికెట్, భర్త ఆధార్ కార్డు ఉండాలిఒంటరి మహిళ పింఛను కోసమైతే పెళ్లైన వారికి కోర్టు జారీ చేసి విడాకుల పత్రం ఉండాలి,

పెళ్లికాని వారికి మ్యారేజ్ అవ్వనట్టు వీ=ూ జారీ చేసిన ధ్రువీకరణ పత్రం కావాలి.దివ్యాంగుల పింఛను కోసం అయితే.. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరమ్ సర్టిఫికెట్ కావాలి.హిజ్రాల పింఛన్ కోసం జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం అవసరం

# సింహపురిలో రియల్ జోరు

**నెల్లూరు, సెప్టెంబర్ 8, పెన్ పవర్:** నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ–లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు.కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ–మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ–లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు.మినీ బైపాస్ పరిసర ప్రాంతాలు నగరంలోని ప్రధాన ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సమీపంలో ఉండటం కూడా కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో కేవలం ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానికులు, ఇప్పుడు సెక్యూరిటీ, పవర్ బ్యాకప్, జిమ్, కార్ పార్కింగ్ వంటి వసతులు ఉండే గేటెడ్ కమ్యూనిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఇక్కడ చదరపు అడుగు ధర రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకు పలుకుతోంది.పరిశ్రమల అభివృద్ధి, పోర్ట్ ఆధారిత వ్యాపారాల విస్తరణతో నెల్లూరు నగరం దక్షిణ కోస్తాలో కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ ఆమోదిత ప్రాజెక్టులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటంతో, రాబోయే రోజుల్లో మినీ బైపాస్ మరియు పోర్ట్ రోడ్డు కారిడార్లలో ఆస్తుల విలువలు మరింత పెరిగే అవకాశం ఉందని రియల్టీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా

**విజయవాడ, సెప్టెంబర్ 8, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్–లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

# లారీ లోమంటలు .. డ్రైవర్, క్లీనర్ సజీవ దహనం

**హైదరాబాద్ పెన్ పవర్:** కడప జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. రాయచోటి ఘాట్ లో సిమెంట్ లారీ బోల్తా పడడంతో మంటలు చెలరేగాయి. ఘటనలో డ్రైవర్, క్లీనర్ సజీవ దహనం అయ్యారు. సిమెంట్ లారీ రాయచోటి నుంచి కడపకు వస్తున్నప్పుడు ప్రమాదం జరిగింది. కడప, అన్నమయ్య జిల్లా బార్డర్ లో ఎడమవైపు మలుపు తిరగకుండా నేరుగా అడవిలోకి లారీ దూసుకెళ్లింది. అగ్ని ప్రమాదం ఎక్కువ కావడంతో అడవికి నిప్పు సెగలు అంటుకున్నాయి. అటవీ ప్రాంతంలో అగ్నిజ్వాలాలు ఎగసిపడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు.

# విజయసాయిరెడ్డి సస్పెన్స్

**విజయవాడ, సెప్టెంబర్ 8 పెన్ పవర్:** విజయసాయిరెడ్డి.. దసరా దాకా సస్పెన్స్ థ్రిల్లర్.. అప్పుడే రిలీజ్..చెప్పిన సమయానికి.. అనుకున్న వేదిక వద్దకు విజయసాయిరెడ్డి వచ్చారు. కొద్దిరోజులుగా ఆయన సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులకు తగ్గట్టుగానే.. సుదీర్ఘంగా మాట్లాడారు. వచ్చిన విలేకరులకు తాగడానికి అల్లం టీ.. స్నాక్స్.. మంచి భోజనం పెట్టారు. కానీ.. తన స్క్రిప్ట్ ప్రకారం సస్పెన్స్ థ్రిల్లర్ కొనసాగించారు.సుదీర్ఘంగా మాట్లాడిన విజయసాయిరెడ్డి పార్టీ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. కాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే పరిపాలించారని చెప్పారు. అంతేకాదు, తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీలో సింహభాగం స్థానాలు జన్ జెడ్ కు కేటాయిస్తామని చెప్పారు. అక్కడితోనే ఆగిపోలేదు.. దసరాకు తాను ఏర్పాటు చేయబోయే పార్టీ గురించి ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు. అంతేకాదు.. తాను ఏర్పాటు చేయబోయే పార్టీ అధికారంలోకి గనుక వస్తే.. తాను ముఖ్యమంత్రి పదవి తీసుకోనని.. మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్ థాక్రే మాదిరిగా పాత్ర పోషిస్తానని చెప్పుకొచ్చారు.విజయసాయిరెడ్డి జగన్ నుంచి దూరం జరిగిన తర్వాత ప్రజాస్వామ్య యుతంగా మాట్లాడుతున్నారు. గడిచిన ఏడాదికాలంగా ఆయన పరిశోధన చేశారట. కాపు కులం నుంచి రెడ్లు ఏ విధంగా వేరుపడ్డారు.. దానికి దారి తీసిన పరిస్థితుల గురించి ఒక పుస్తకాన్ని రాశారట. ఏపీ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే పరిపాలించారని.. మిగతా సామాజిక వర్గాలు ఎందుకు పరిపాలించకూడదని ప్రశ్నించడం విజయసాయిరెడ్డి.. కేవలం రెడ్ల గురించి మాత్రమే పరిశోధన చేయడమేంటి.. పుస్తకం రాయడం ఏంటి.. పైగా పార్టీని ఏర్పాటు చేయబోతున్న ఈ సమయంలో దాని ప్రస్తావన ఎందుకుఆంధ్ర రాష్ట్రానికి దాదాపు 1500 టీఎంసీల నీళ్లు అవసరమని.. ప్రస్తుతం 1100 టిఎంసిల నీళ్లు మాత్రమే ఉన్నాయని విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన ఆవేదనలో అర్థం ఉంది. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెంబర్ 2 స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి ఏం చేశారు.. అప్పట్లో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి హైజాక్ చేయలేదు కదా. అప్పుడు విజయసాయిరెడ్డి ఎంత చెబితే జగన్ కు అంత కదా.. అప్పుడు విజయసాయి రెడ్డి ఏం చేశారు.. ఇప్పుడు ప్రాధాన్యం తగ్గింది.. అందువల్లే ఏపీ ప్రయోజనాలు విజయ సాయి రెడ్డికి గుర్తుకు వచ్చాయి. దసరా దాకా పార్టీ ఏర్పాటును విజయసాయిరెడ్డి సస్పెన్స్ లో పెట్టారు.. కానీ ఇప్పటికీ ఏపీలో పరిస్థితి టిడిపి కూటమి వర్సెస్ వైఎస్ఆర్సిపి అన్నట్టుగానే ఉంది. అప్పట్లో షర్మిల పార్టీ పెట్టినప్పటికీ పెద్దగా సత్తా చూపించిన దాఖలాలు లేవు. విజయసాయిరెడ్డి చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల్లో రాజకీయ శూన్యత.. రాజకీయ అనివార్యత ఏపీ రాష్ట్ర రాజకీయాలలో కనిపిస్తుంది అంటే.. నమ్మశక్యంగా లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మ్యాప్‌లో పీఓకే కనపడేసరికి.. పాకిస్థాన్‌కి పాపం మైండ్ బ్లాక్




క్రికెట్ మ్యాచ్ ఉందంటే చాలు.. బ్యాట్, బాల్ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవడం మిగతా దేశాల పని. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పని మాత్రం కాస్త వేరు. ప్రపంచంలో ఎక్కడ ఏ మ్యాప్ కనిపించినా.. భూతద్దం పట్టుకుని కూర్చుని "అయ్యో.. మా ఆక్రమిత ప్రాంతాన్ని భారత్‌లో కలిపేశారే" అని గుండెలు బాదుకోవడమే వారి ముఖ్య విధుల జాబితాలో చేరిపోయినట్లుంది. తాజాగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) చేసిన ఒక్క చిన్న ప్రమోషనల్ వీడియోతో పీసీబీకి నిద్రలేకుండా పోయింది. భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య త్వరలో జరగబోయే టీ20 సిరీస్ కోసం ఏసీబీ ఒక ప్రచార వీడియోను తయారుచేసింది. అందులో భారత్ మ్యాప్‌ను చూపించే క్రమంలో.. అసలైన భారత్‌కు చెందిన పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే), గిల్గిట్–బాల్టిస్థాన్‌లను భారత్‌లోనే కలిపి చూపించారు. ఇక అంతే ఆ దృశ్యం చూడగానే పాకిస్థాన్ బోర్డుకు మ్యాచ్ ఓడిపోయినంత ఫ్యామిలీ ఫీలింగ్ వచ్చేసింది. "అయ్యయ్యో.. ఇదేం అన్యాయం.. క్రీడల్లో రాజకీయాలా?" అంటూ మీడియా ముందుకు వచ్చి లబోదిబోమనడం మొదలెట్టారు. పాకిస్థాన్ మీడియా అయితే ఈ మ్యాప్ వివాదాన్ని ఏదో మూడో ప్రపంచ యుద్ధం స్థాయిలో కవర్ చేస్తోంది. "అసలు అఫ్గాన్ బోర్డు కావాలనే చేసిందా? లేక గ్రాఫిక్స్ డిజైనర్ కంటికి పాకిస్థాన్ ఆక్రమించిన భాగాలు సరిగ్గా ఆనుకోలేదా?" అంటూ రకరకాల పరిశోధనలు మొదలుపెట్టేశారు. ఆఖరికి ఈ తీవ్రమైన "మ్యాప్ నేరానికి" గాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి ఫిర్యాదు చేసేందుకు పాక్ పెద్దలు కాగితాలు పట్టుకుని సిద్ధమవుతున్నారట. ఐసీసీకి వెళ్లి ఏమని ఫిర్యాదు చేస్తారో మరి? "వాళ్ళు నిజమైన మ్యాప్ చూపించారు, మాకు కోపం వచ్చింది" అని చెప్తారేమో..అయినా అఫ్గానిస్థాన్ బోర్డు చేసిందేముంది? ఇండియా అధికారిక మ్యాప్ ఎలా ఉంటుందో.. ప్రపంచానికి ఏది నిజమో దాన్నే చూపించింది. నిజం నిలకడగా తెలుస్తుందంటే ఇదేనేమో.. మైదానంలో సిక్సర్లు కొట్టడం పక్కన పెట్టి ప్రమోషనల్ వీడియోల్లో మ్యాప్‌లు సరి చూసుకోవడానికే సరిపోతుంటే.. ఇక మ్యాచ్‌లు గెలవడం ఎలాగో పాక్ జట్టే ఆలోచించుకోవాలి. సెప్టెంబర్ 13 నుంచి జరగబోయే ఈ సిరీస్‌లో బంతి ఏమో కానీ ఈ మ్యాప్ వివాదం మాత్రం పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు గట్టి బౌన్సర్‌లా తగిలిందని స్పోర్ట్స్ సర్కిల్స్ లో నవ్వుకుంటున్నారు.

# షాకింగ్: అంబానీ కోడలు ధరించిన వాచ్ & బ్యాగ్ ఖరీదు ఎంతో తెలుసా?



అంబానీ కోడలు రాధికా అంబానీ తన రాయల్ ఫ్యాషన్ సెన్స్– విలాసవంతమైన ఆభరణాల ఎంపికతో సోషల్ మీడియాలో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. పాపులర్ ఫ్యాషన్ ప్రభావశీలి పేజీ షేర్ చేసిన వివరాల ప్రకారం.. రాధిక ఇటీవల ధరించిన అరుదైన డెకరేటివ్ డైమండ్ వాచ్, వరల్డ్ క్లాస్ హ్యాండ్ బ్యాగ్ కాంబినేషన్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.రాధికా అంబానీ చేతికి ధరించిన వాచ్ అత్యంత అరుదైన –పాటెక్ ఫిలిప్– బ్రాండ్‌కు చెందినది. –ట్వంటీ –4 ఫోలియేజ్ రిఫరెన్స్ . 4909/107జీ మోడల్ అయిన ఈ వాచ్‌ను 18 క్యారెట్ల వైట్ గోల్డ్‌తో తయారు చేశారు. దీనిపై అత్యంత ఖరీదైన బ్యాగెట్ వజ్రాలతో పాటు...అందమైన ఎమరాల్డ్ (పచ్చల) లీఫ్ ప్యాటర్న్ డిజైన్‌ను అమర్చడం ఈ వాచ్ ప్రత్యేకత.దీనికి తోడు రాధిక హ్యాండ్ బ్యాగ్ ఫ్యాషన్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన యాక్సెసరీగా పాపులరైంది. ప్రముఖ డిజైనర్ పియరీ హార్డీ రూపుదిద్దిన –హెర్మెస్ హాట్ బిజౌట్రీ సాక్ బిజౌ బిర్కిన్– బ్యాగ్‌ను ఆమె క్యారీ చేశారు. 18 క్యారెట్ల వైట్ గోల్డ్‌తో రూపొందించిన ఈ రాయల్ బ్యాగ్‌పై ఏకంగా 3000 కంటే ఎక్కువ వజ్రాలను అమర్చడం విశేషం.ఫ్యాషన్ విశ్లేషకుల అంచనా ప్రకారం.. రాధికా అంబానీ ధరించిన ఈ వాచ్ – హ్యాండ్ బ్యాగ్ ల మొత్తం విలువ మాత్రమే దాదాపు 4 మిలియన్ యూఎస్ డాలర్లు.. అంటే భారతీయ కరెన్సీలో సుమారు రూ. 33 కోట్లకు పైగా ఉంటుందని తెలుస్తోంది. కేవలం వాచ్ ధర కోటిన్నర వరకూ ఉంటుందని, హ్యాండ్ బ్యాగ్ ఖరీదు చాలా ఎక్కువగా ఉంటుందని కూడా చెబుతున్నారు. ఈ లగ్జరీ యాక్సెసరీస్‌తో పాటు ప్రముఖ భారతీయ డిజైనర్లు అబూ జానీ – సందీప్ ఖోస్లా ప్రత్యేకంగా డిజైన్ చేసిన –జెరీ జోరా– ఔట్‌ఫిట్‌లో రాధిక ధగధగా మెరిసిపోయారు.అత్యంత విలాసవంతమైన డిజైనర్ డ్రెస్ కి తగ్గట్టే కోట్లాది రూపాయల విలువైన ఆభరణాలతో రాధికా అంబానీ ఆవిష్కరించిన ఈ గ్రాండ్ లుక్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఫ్యాషన్ ప్రేమికులు – అభిమానులు అంబానీ కోడలు ధరించిన రాయల్ కాంబినేషన్‌కు ఫిదా అవుతూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# యూట్యూబర్ నందు సక్సెస్.. రావాల్సిన మైలేజ్ వచ్చింది.. మైలేజ్ ఊరికే రాదు!

యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగులను మోసం చేశారనే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ నందు వ్యవహారం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. యూట్యూబ్ వీడియోలతో పాపులారిటీ సంపాదించి గతంలో అనిల్ రావిపూడి–చిరంజీవి సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఇప్పుడు చట్టపరమైన చిక్కుల్లో పడి వార్తల్లో నిలిచారు.యూకేలో నివసించే నందుపై పలువురు తెలుగు రాష్ట్రాల బాధితులు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదైనట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఆమె హైదరాబాద్‌కు రావడం.. అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తిని రేపుతోంది. మీడియా అంతా ఈమె వార్తలు నామస్మరణతో మారుమోగిపోతోంది.నందుకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి గుర్తింపు ఉంది. యూట్యూబ్ వీడియోల ద్వారా ఆమెకు వచ్చిన పాపులారిటీతో పాటు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి నటించిన సినిమాలో కనిపించడం కూడా ఆమెకు మరింత గుర్తింపు తెచ్చింది. అయితే ఇప్పుడు ఆమె పేరు మాత్రం సినిమా లేదా యూట్యూబ్ కంటెంట్ వల్ల కాకుండా కేసులు, అరెస్ట్ వ్యవహారంతో వార్తల్లో నిలుస్తోంది.

**బిగ్ బాస్ ఆఫర్ కోసమే హైదరాబాద్‌కు వచ్చారా?**

నందుకు తెలుగు బిగ్ బాస్‌లో అవకాశం దక్కిందనే ప్రచారం కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతోంది. కేసులు, లుక్‌ఔట్ నోటీసుల నేపథ్యంలో కూడా ఆమె హైదరాబాద్‌కు రావడం వెనుక బిగ్ బాస్ ఎంట్రీ ఉందనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. హైదరాబాద్ చేరుకున్న సమయంలోనే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారణకు తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో బిగ్ బాస్‌లో ఎంట్రీ ఇవ్వాలనుకున్నారనే ప్రచారానికి భిన్నంగా ఆమె రాక మరో కారణంతో వార్తల్లోకి వచ్చింది.

**అరెస్ట్‌తో ఒక్కసారిగా పెరిగిన ఫ్రీ పబ్లిసిటీ?**

నందు అరెస్ట్ వ్యవహారం ప్రస్తుతం తెలుగు మీడియాలో విస్తృతంగా చర్చకు వస్తోంది. సోషల్ మీడియాలోనూ ఆమె పేరు ట్రెండ్ అవుతూ ఉండటంతో ఒక్కసారిగా ఆమెకు భారీ ప్రచారం లభించిన పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు ఆరోపణలు, మరోవైపు అరెస్ట్.. ఇంకోవైపు బిగ్ బాస్ ఎంట్రీపై ప్రచారం.. ఇలా అన్నీ కలిసి నందును వార్తల్లో నిలిపాయి.

# కోర్టు విచారణకు యూట్యూబర్ నందన.. దేశం వదిలి వెళ్లడం ఇక కష్టమే..



వీసా స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్ నందూస్ వరల్డ్ నందన పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తన లాయర్‌తో కలిసి వచ్చిన ఆమెను పోలీసులు కేసుకు సంబంధించిన అంశాలపై ప్రశ్నిస్తున్నారు. నందన తన సొంత వాహనంలో పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా.. ఆమె వెంట కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.అంతకుముందు నందనను పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం 41ఏ నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి నకిలీ వీసా లెటర్లను విక్రయించారనే ఆరోపణలు నందనపై ఉన్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి గతేడాది నవంబర్‌లో శివక్రాంతి అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఆ ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో భాగంగానే ప్రస్తుతం నందనను ఇబ్రహీంపట్నం పోలీసులు విచారిస్తున్నారు.విచారణలో వీసా స్కామ్‌కు సంబంధించిన మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా నకిలీ వీసా లెటర్ల వ్యవహారం, షెల్ కంపెనీల ఏర్పాటు, డబ్బుల లావాదేవీలు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీసే అవకాశం ఉంది.

**పాస్‌పోర్ట్ సీజ్ చేస్తారా?**

ఇక ఈ కేసులో నందన విదేశాలకు వెళ్లగలరా? అనే చర్చ కూడా మొదలైంది. సాధారణంగా క్రిమినల్ కేసుల్లో నిందితులపై కోర్టు లేదా దర్యాప్తు సంస్థలు విధించే షరతులను బట్టి వారి ప్రయాణంపై ఆంక్షలు ఉండొచ్చు. అవసరమైతే పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవడం లేదా విదేశాలకు వెళ్లకుండా న్యాయపరమైన ఆంక్షలు విధించడం కూడా సాధ్యమవుతుంది.ప్రముఖ న్యాయవాదుల అభిప్రాయం ప్రకారం.. ఒక వ్యక్తిపై కేసు నమోదై, దర్యాప్తు లేదా న్యాయ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కేవలం బెయిల్ రావడం వల్లే స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లే హక్కు లభించదు. కోర్టు విధించే బెయిల్ షరతులు, పాస్‌పోర్ట్‌కు సంబంధించిన ఆదేశాలు, కేసు తీవ్రత వంటి అంశాలు కీలకంగా ఉంటాయి.

నందనకు యూకే పౌరసత్వం ఉన్నా.. విదేశీ పౌరురాలైనా భారతదేశంలో నమోదైన కేసును ఎదుర్కోవాల్సిందేనని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఆరోపణలు కోర్టులో నిరూపితమై శిక్ష పడితే, కోర్టు ఆదేశాలు, వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారమే తదుపరి చర్యలు ఉంటాయి.అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాలను బట్టి చూస్తే.. వీసా స్కామ్ కేసు నుంచి పూర్తిగా బయటపడే వరకు నందన విదేశాలకు వెళ్లే విషయంలో చట్టపరమైన అడ్డంకులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే పాస్‌పోర్ట్ సీజ్ చేస్తారా? విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధిస్తారా? అనేది దర్యాప్తు, కోర్టు ఆదేశాలపై ఆధారపడి ఉంటుంది.

# తమిళ రాజకీయాలను ఊపేస్తున్న ముగ్గురు రెడ్లు? ఎవరు ఆ ముగ్గురు?!



తమిళ రాజకీయాలను ఇప్పుడు ట్రిపుల్ ఆర్ ఊపేస్తోంది. ఏపీకి చెందిన ముగ్గురు రెడ్లు తమిళనాడు ప్రభుత్వాన్ని గుప్పెట్లో పెట్టుకుని అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలు పెను దుమారానికి దారితీశాయి. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయిన ఆ ముగ్గురు ఎవరు? అంటూ నెటిజన్లు ఇంటర్నెట్ లో గాలిస్తున్నారు. ముఖ్యమంత్రి దళపతి విజయ్ కి నీడలా ఉంటున్న విష్ణురెడ్డి, ఆయన బావమరిది సుజయ్ రెడ్డి, ఈయన స్నేహితుడు అనిల్ రెడ్డి పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, గనుల శాఖను గుప్పెట్లో పెట్టుకున్నారని ఉదయనిధి ఆరోపించారు. తమిళనాడులో అధికార, విపక్షాల మధ్య జరుగుతున్న రాజకీయ యుద్ధంలో అనూహ్యంగా ముగ్గురు తెలుగువారి పేర్లు ప్రస్తావనకు రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రాంతీయ భావజాలం ఎక్కువగా ఉండే తమిళనాడులో తెలుగు వ్యాపారులు తెరవెనుక రాజకీయం నడిపేటంత స్థాయికి వెళ్లారా? అన్న చర్చ ఆసక్తి రేపుతోంది. ప్రతిపక్ష నేత బహిరంగంగా విమర్శలు చేయడంతో ఆ ముగ్గురు రెడ్లు ఎవరు? వారి స్వస్థలాలు ఎక్కడ అన్న చర్చ మరింత కుతూహలం కలిగిస్తోందని అంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో విష్ణురెడ్డి ముఖ్యమంత్రి దళపతి విజయ్ కి అత్యంత సన్నిహితుడిగా చెబుతున్నారు.

ఏపీలోని అన్నమయ్య జిల్లా కలికిరికి చెందిన విష్ణు రెడ్డి అలియాస్ విష్ణువర్ధన్ రెడ్డి చెన్నైలో స్థిరపడినట్లు చెబుతున్నారు. అక్కడ గ్రానైట్ వ్యాపారం చేయడంతోపాటు దళపతి విజయ్ సినిమాలకు ఫైనాన్స్ చేసేవారన్న ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే విజయ్ తో స్నేహం పెరిగిందని, ఆయన పార్టీ పెట్టిన తర్వాత టీవీకే వ్యవహారాలను సైతం విష్ణురెడ్డి పర్యవేక్షించేవారని చెబుతున్నారు. ఇక ఈయన మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డికి సమీప బంధువుగా చెబుతున్నారు. విష్ణురెడ్డితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఇద్దరిదీ ఏపీనే అని అంటున్నారు.

విష్ణురెడ్డి బావమరిది సుజయ్ రెడ్డి, ఈయన స్నేహితుడు అనిల్ రెడ్డి కూడా ప్రస్తుతం టీవీకే పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారని చెబుతున్నారు. అయితే ఈ ముగ్గురు ప్రభుత్వ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడంపై డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ కి ఈ ముగ్గురు రెడ్లు షాడోగా పనిచేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి డీఎంకే అధినేత స్టాలిన్, ఆయన కుమారుడు మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి గత ప్రభుత్వంలో తీవ్ర అవినీతి చేశారని సీఎం విజయ్ ఆరోపించారు. దీనిపై సభలోనే మాట్లాడేందుకు స్పీకర్ అనుమతి ఇవ్వలేదంటూ ఆరోపణలు చేసిన ఉదయనిధి సభ నుంచి వాకౌట్ చేసిన తర్వాత ముఖ్యమంత్రి విజయ్ స్నేహితులైన ముగ్గురు రెడ్లపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం ఈ టాపిక్ తమిళ రాజకీయాలను వేడెక్కిస్తోందని అంటున్నారు.

# విజయవాడ మేయర్ పీఠంపై కర్చీఫ్ వేసేశారు!



విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి కీలక పదవి మేయర్. దీనిని దక్కించుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యే ఒకరు కర్చీఫ్ వేసేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు.. తన కుమారుడు సిద్ధార్థ ను ఈ కీలక పదవికి ఎంపిక చేయాలన్నది ఉమా కోరిక. ఈ నేపథ్యం లో ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి బయోడేటా కూడా సమర్పించారు. అయితే.. దీనిపై చంద్రబాబు ఎలాంటి ప్రకటనా చేయలేదు.తాజాగా జరుగుతున్న పార్టీ నాయకుల కాన్‌క్లేవ్‌లో చంద్రబాబు ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ఎవరికి వారు మేయర్ పీఠాలపై కర్చీఫ్‌లు వేసేసుకుంటున్నారని అన్నారు. ఇది సరైన విధానం కాదని తెలిపారు. స్థానిక ఎన్నికల తర్వాత.. నాయకుల అభిప్రాయం తెలుసుకుని.. మేయర్, మునిసిపల్ చైర్మన్ ఎన్నికలు ఉంటాయని తెలిపారు. ఈ విషయంలో పార్టీ కూడా.. ఎలాంటి నిర్ణయం తీసుకోదని.. స్థానికంగా విజయం దక్కించుకున్న వారి అభిప్రాయాలు, ప్రజా మోదం తప్పని సరి అని పేర్కొన్నారు.మరో వైపు.. బీసీ నాయకులు కూడా విజయవాడ మేయర్ పీఠంపై దృష్టి పెట్టారు.

గతంలో 1995లో విజయ వాడ మేయర్ పీఠాన్ని బీసీకి టీడీపీ ఇచ్చింది. అప్పట్లో పంచుమర్తి అనురాధ మేయర్‌గా ఎంపికయ్యారు. ఆ తర్వాత.. మళ్లీ కమ్మ సామాజిక వర్గానికి ఇచ్చినా.. పార్టీ పెద్దగా లబ్ది పొందలేదు. దీంతో ఇప్పుడు మరోసారి బీసీలకు అవకాశం ఇవ్వాలని.. కోరుతున్నారు. గత స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఇదే మంత్రాన్ని పఠించింది. బీసీ మహిళకు విజయవాడ మేయర్ పీఠాన్ని అప్పగించింది.రాష్ట్రంలోనూ నగరంలోనూ బీసీలు ఎక్కువగా ఉన్నందున.. ఆ వర్గానికి అవకాశం ఇప్పించాలన్నది టీడీపీ బీసీ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేలు అగ్రవర్ణాలకు చెందిన వారని.. కీలకమైన విజయవాడలో బీసీలకు పార్టీ ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. బీసీల ఓటు బ్యాంకు కీల కంగా మారుతున్న నేపథ్యంలో విజయవాడ మేయర్ పీఠాన్ని వారికి ఇవ్వాలన్నది స్థానిక నాయకుల డిమాండ్. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు.

# బహుముఖ దౌత్యం!

ప్రపంచం మరోసారి శక్తి సమీకరణాల పునర్వ్యవస్థీకరణ దశలోకి అడుగుపెడుతున్న వేళ, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) 26వ శిఖరాగ్ర సమావేశం ఆసియా భౌగోళిక రాజకీయాల్లో తన ప్రాధాన్యాన్ని చాటుకుంది. కిర్గిజ్ రిపబ్లిక్ రాజధాని బిష్కెక్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1న జరిగిన సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ సహా సభ్యదేశాల అధినేతలు హాజరయ్యారు. 2001లో 'షాంఘై ఫైవ్'గా ప్రారంభమైన సంస్థ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. 2017లో భారత్, పాకిస్థాన్‌లు చేరిన తర్వాత ఎస్‌సీఓ విస్తృతమైన భౌగోళిక, రాజకీయ ప్రభావాన్ని సంతరించుకుంది. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం అనే మూడు సవాళ్లపై సభ్యదేశాలు మరోసారి గట్టిగా మాట్లాడటం భారత ఆందోళనలకు అనుగుణంగా ఉంది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో బిష్కెక్ ప్రకటనలో ఇరాన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు ప్రకటించడం, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనపై ఆందోళన వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించుకునే హక్కును సమర్థించడం, పాలస్తీనా సమస్యకు న్యాయమైన పరిష్కారమే పశ్చిమాసియాలో శాశ్వత స్థిరత్వానికి మార్గమని పేర్కొనడం ద్వారా ఎస్‌సీఓ తనను కేవలం భద్రతా, ఆర్థిక సహకార వేదికగా కాకుండా అంతర్జాతీయ రాజకీయ చర్చలకు ప్రత్యామ్నాయ వేదికగా చూపించింది. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పాత్రపై ప్రకటన మౌనం పాటించడం సంస్థలోని అంతర్గత భిన్నాభిప్రాయాలను కూడా స్పష్టం చేసింది. ప్రతి అంశంపై ఏకాభిప్రాయం లేకపోయినా, ఉమ్మడి ప్రయోజనాలపై కలిసి మాట్లాడగలగడమే ఎస్‌సీఓ బలం.

భారతదేశానికి ఎస్‌సీఓ విలువ మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఏకపక్ష ప్రపంచ వ్యవస్థకు బదులు బహుళ ధ్రువ ప్రపంచం వైపు పరిస్థితులు మారుతున్న సమయంలో, భారత్ ఏ ఒక్క శిబిరానికీ పూర్తిగా కట్టుబడి ఉండకుండా, అవసరమైన ప్రతి శక్తికేంద్రంతో సంభాషణ కొనసాగిస్తోంది. బిష్కెక్ వేదికగా ప్రధాని మోదీ ఉగ్రవాదంపై 'ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు' అని స్పష్టం చేయడం భారత భద్రతా ప్రయోజనాలకు కీలక సందేశం. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం అవసరాన్ని ప్రస్తావించడంతోపాటు, అక్కడ భారత్ అందిస్తున్న మానవతా సహాయాన్ని గుర్తుచేశారు. ఎస్‌సీఓ దేశాల మధ్య మెరుగైన అనుసంధానం అవసరమని చెప్పిన మోదీ, దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలన్న షరతును స్పష్టం చేశారు. ఇది చైనా-పాకిస్థాన్ ఆర్థిక కారిడార్‌పై (సీపెక్) భారత్ అభ్యంతరాలకు కొనసాగింపే. చైనా ముందుకు తీసుకెళ్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌కు ఇతర సభ్యదేశాలు మద్దతు పలికినా, భారత్ దానికి దూరంగా ఉండటం తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని చాటింది. అయితే ఎస్‌సీఓను చైనా వ్యతిరేక వేదికగా మార్చకుండా భారత్ వ్యవహరించడం గమనార్హం. గల్వాన్ తర్వాత దెబ్బతిన్న భారత్-చైనా సంబంధాల్లో కజాన్, టియాంజిన్ సమావేశాల ద్వారా మళ్లీ సంభాషణకు మార్గం తెరుచుకోవడం ఇందుకు ఉదాహరణ. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, రష్యాతో రక్షణ-ఇంధన సంబంధాలు, చైనాతో పోటీతోపాటు సంభాషణ, ఇరాన్‌తో ప్రాంతీయ ప్రయోజనాలు.. ఈ విభిన్న సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడానికి ఎస్‌సీఓ భారత్‌కు ఉపయోగపడే వేదిక.

అయితే బిష్కెక్ సమావేశం ముగియడంతోనే భారత్ ముందున్న అసలు దౌత్య పరీక్ష మొదలవుతోంది. వచ్చే ఏడాది ఎస్‌సీఓ అధ్యక్ష బాధ్యతలు పాకిస్థాన్ చేపట్టనుంది, తదుపరి శిఖరాగ్ర సమావేశం కూడా అక్కడే జరగనుంది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేయడం వంటి పరిణామాలతో ఇప్పటికే ఇరుదేశాల సంబంధాలు అత్యంత సున్నితంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పాకిస్థాన్‌కు వెళ్తారా? లేక మరోస్థాయి ప్రతినిధిని పంపుతారా? అన్నది కీలక దౌత్య నిర్ణయం కానుంది. అయితే ఎస్‌సీఓను కేవలం భారత్-పాకిస్థాన్ విభేదాల కోణంలో చూడటం సరికాదు. ఒకే బహుపాక్షిక వేదికలో కలుసుకోవడం, కనీసస్థాయి సంభాషణ కొనసాగించడం, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడడం ప్రాంతీయ స్థిరత్వానికి ఉపయోగపడుతుంది. సభ్యదేశాల మధ్య సరిహద్దు వివాదాలు, వ్యూహాత్మక పోటీలు ఉన్నప్పటికీ 25 ఏళ్లుగా సంస్థ కొనసాగడం దాని సంభాషణ సామర్థ్యానికి నిదర్శనం. స్థానిక కరెన్సీలతో వాణిజ్యం, ఎస్‌సీఓ డెవలప్‌మెంట్ బ్యాంకు వంటి ఆలోచనలు కూడా సభ్యదేశాలు ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థలపై దృష్టి పెడుతున్నాయన్న సంకేతాలు. అయితే ప్రకటనలకు మించి ఆచరణాత్మక సహకారం పెరిగితేనే ఎస్‌సీఓ ప్రభావం పెరుగుతుంది. ఉగ్రవాదంపై ఉమ్మడి చర్యలు, ప్రాంతీయ అనుసంధానం, వాణిజ్యం, ఇంధన భద్రత, సాంకేతిక సహకారం వంటి రంగాల్లో ఫలితాలు రావాలి. భారత్ కూడా ఎస్‌సీఓను చైనా లేదా పాకిస్థాన్ ఆధిపత్య వేదికగా కాకుండా, తన ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే బహుపాక్షిక దౌత్య సాధనంగా ఉపయోగించుకోవాలి.

ప్రపంచం శిబిరాలుగా విడిపోతున్న కొద్దీ, ప్రతి దేశంతో స్నేహం సాధ్యంకాకపోయినా, ప్రతి దేశంతో సంభాషణ అవసరం. తన భద్రత, సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా అందరితో మాట్లాడగలగడమే భారత దౌత్య బలం. ఎస్‌సీఓ భారత్‌కు కేవలం ఒక అంతర్జాతీయ సమావేశ వేదిక కాదు, మారుతున్న ప్రపంచంలో భారత ప్రయోజనాలను కాపాడుకుంటూనే సంభాషణ కొనసాగించే వ్యూహాత్మక వేదిక. ఈ సమతుల్య దౌత్యనీతే, రేపటి బహుళ ధ్రువ ప్రపంచంలో భారత్‌ను ఒక విశ్వసనీయ, స్వతంత్ర శక్తిగా నిలబెడుతుంది. ఏ కూటమిలోనూ పూర్తిగా కలిసిపోకుండా, ప్రతి వేదికనూ తన ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకునే నేర్పే, భారత విదేశాంగ విధానపు అసలైన పరిణతికి నిదర్శనం. బిష్కెక్ శిఖరాగ్ర సదస్సు ద్వారా భారత్ చాటిన సందేశం స్పష్టం. సూత్రబద్ధత, వ్యూహాత్మక స్వేచ్ఛ రెండూ ఏకకాలంలో సాధ్యమే. రాబోయే పాకిస్థాన్ అధ్యక్షతన జరిగే సవాళ్లను ఎదుర్కోవడంలోనూ ఇదే సమతుల్య వైఖరి భారత్‌కు మార్గదర్శకంగా నిలవాల్సి ఉంటుంది. చివరిగా, ఎస్‌సీఓ విజయం అంతిమంగా సభ్యదేశాల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. ప్రకటనలను ఆచరణలో అమలు చేసినప్పుడే ఈ వేదిక నిజమైన ప్రాసంగికతను చాటుకోగలదు.

# ప్రయివేటీకరణ దిశగా.. ఇస్రో!?




భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిలో అత్యంత గొప్ప విజయాన్ని సాధించిన రోజే (మొండిగా వ్యవహరించే జీఎస్ఎల్‌వీ రాకెట్‌పై తన తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-05ను ప్రయోగించిన సెప్టెంబర్ 4నే).. దీని ఉద్యోగ సంఘాలు దీర్ఘకాలిక ప్రణాళికలపై స్పష్టత కోరుతూ లేఖ రాయడం ఒక వైరుధ్యంలా కనిపించింది. అయితే, ఈ ఫిర్యాదు ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు, దీర్ఘకాలంగా పేరుకున్న ఆందోళనే ఇది. 2023 ఏప్రిల్ నాటి భారత అంతరిక్ష విధానం నుంచే, భవిష్యత్తులో ఏదోక నిర్దిష్టం కాని రోజున ఇస్రో వాణిజ్య ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాలు తయారు చేయడం ఆపేస్తుందన్న సందేశం స్పష్టంగానే ఉంది. నాసా స్ఫూర్తితో రూపొందించినట్టు కనిపించే ఈ విధానం, భారీ అన్వేషణాత్మక మిషన్లపై, అక్షరాలా చంద్రుడిపైకి దూసుకెళ్లే ప్రయోగాలపైనే దృష్టి పెట్టాలని భావిస్తోంది. అంతరిక్ష మిషన్లను వేగవంతం చేస్తున్న ఒక సంస్థ, తన ఉద్యోగుల్లో ఒక వర్గాన్ని ఎందుకు కలవరపెడుతుంది? ఇది కనిపించేంత విరుద్ధమైన విషయమేమీ కాదు. తొమ్మిది ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా సంతకం చేసి, ఇస్రో చైర్మన్ వి నారాయణన్‌కు రాసిన ఐదు పేజీల లేఖ, సిబ్బంది సంఖ్య, నియామకాలు, ప్రధాన విధుల ఔట్‌సోర్సింగ్‌పై స్పష్టత కోరింది. ఐఎన్-స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా ఆగస్టు 21న ఒక సదస్సులో చేసిన వ్యాఖ్యలను ఈ లేఖ ఉటంకిస్తూ, "చివరకు ఇస్రో ఎలాంటి ప్రయోగ వాహనాలనూ తయారు చేయదు, తయారీ చేపట్టదు" అని అన్న మాటలను ప్రస్తావించింది. ఈ ప్రకటనలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందినా, ఆమోదిత విధానం, దాని చట్టపరమైన, పరిపాలనాపరమైన ప్రాతిపదిక, దాని దశలవారీ అమలు, ఇప్పటికే ఉన్న శ్రామిక శక్తిపై, భవిష్యత్ ప్రభుత్వ నియామకాలపై దాని పర్యవసానాలను వివరిస్తూ అంతరిక్ష శాఖనుంచి తన ఉద్యోగులకు ఎలాంటి అధికారిక సమాచారమూ అందలేదని లేఖ స్పష్టం చేసింది.

ఈ ఆందోళనలకు ప్రతిస్పందనగా, ఇస్రో సిబ్బంది సంఘం ఒక అధికార ప్రతినిధి ద్వారా స్పష్టం చేసిన అంశం గమనార్హం. తాము ప్రైవేటు రంగం అంతరిక్ష పరిశ్రమలోకి ప్రవేశించడాన్ని వ్యతిరేకించడం లేదని, కేవలం ఇస్రో తన భవిష్యత్ దిశను ఉద్యోగులకు స్పష్టంగా తెలియజేయాలని మాత్రమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. రాకెట్ నిర్మాణం, సాంకేతిక అభివృద్ధి వంటి పనులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వముంటే, రాబోయే సంవత్సరాల్లో ఇస్రో పాత్ర ఏమిటో స్పష్టంగా చెప్పాలని, ఉద్యోగాల్లో కోతలు ఉంటాయా? అని వారు ప్రశ్నించారు. చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్‌వీ)లో ఇప్పటికే ఈ మార్పు కనిపిస్తోందని, ఇది భవిష్యత్తులో పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3కు కూడా విస్తరించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాలు లేఖలో పేర్కొన్నాయి. గోయెంకా వ్యాఖ్యలు ప్రభుత్వ అధికారిక వైఖరినా? లేక కేవలం ఐఎన్-స్పేస్ ప్రచార దృక్పథమా అన్నది స్పష్టం చేయాలని, పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3, ఎస్ఎస్ఎల్‌వీ, భవిష్యత్ వాహనాల రూపకల్పన, అభివృద్ధి, సాకారం, సమీకరణ, పరీక్ష, ప్రయోగానికి ఇస్రోనే బాధ్యత వహిస్తుందా? అన్నది తెలియజేయాలని కూడా వారు కోరారు. ఇప్పటికే ఖాళీలు, ఉద్యోగుల నిష్క్రమణతో పరిమితమైన గ్రూప్ ఏ, బీ, సీ పోస్టుల్లో క్రమమైన నియామకాలు మరింత తగ్గే అవకాశముందని, ఇది ఇస్రో సర్వీసు స్థిరత్వం చుట్టూ తమ జీవితాలను ప్రణాళిక వేసుకున్న ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అనిశ్చితిని సృష్టించగలదనీ హెచ్చరించారు. ప్రధాన కార్యకలాపాలు ప్రభుత్వ నియంత్రణ వెలుపలికి తరలిపోతే, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, నాణ్యతా హామీ, భద్రతా సంస్కృతి బలహీనపడే ప్రమాదముందనీ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, "ప్రైవేటీకరణ చేయబోమని" ఇస్రో ప్రకటించగా, ప్రైవేటు భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఏర్పాటైన ఐఎన్-స్పేస్, సంస్థను "బలహీనపరచబోమని", కేవలం పరిశ్రమ పాత్ర పెరగాల్సి ఉందని మాత్రమే చెబుతోంది. ఈ రెండు ప్రకటనలూ అసలైన ఆందోళనపై - సంభావ్య ఉద్యోగ నష్టాలపై మౌనం వహిస్తున్నాయి.

ఇది ఇస్రో పరిష్కరించాల్సిన ఒక అంతర్లీన ఉద్రిక్తతను ముందుకు తెస్తుంది. భారత అంతరిక్ష రంగంపై దాని దార్శనికత, అంతరిక్ష పోటీలపై మోహపడకుండా, సామాజిక అభివృద్ధి సాధనంగా అంతరిక్ష సాంకేతికతపైనే లేజర్ దృష్టి పెట్టాలన్న దాని స్థాపక సూత్రాలకు అనుగుణంగా ఉందా? లేక 'అంతరిక్ష స్టార్టప్‌ల' వెల్లువతో, కొద్దిమంది అంతరిక్ష ప్రయాణ దేశాల్లో భారత్ ఒకటిగా ఉందన్న అధికార ప్రతిరూపమే ఇప్పుడు ఆ దార్శనికతకు పునాదిగా మారిందా? అమెరికా అంతరిక్ష విభాగం బడ్జెట్‌కు 16 రెట్లు తక్కువగా, రూ.13,705 కోట్లతో (24.4 బిలియన్ డాలర్లకు వ్యతిరేకంగా) పనిచేస్తున్న ఇస్రోతో పోలిస్తే, నాసా కూడా 1960ల నుంచి తన స్థాయిని తగ్గించుకుంది. 1966లో అమెరికా జీడీపీలో 0.7 శాతంగా ఉన్న దాని బడ్జెట్, ఇప్పుడు 0.1 శాతానికి పడిపోయింది. అపోలో మిషన్ గరిష్ఠ స్థాయిలో 36,000 మంది ప్రభుత్వ ఉద్యోగులుంటే, ఇప్పుడు అది దాదాపు 14,000కు తగ్గింది. తొలినాళ్లలో ప్రతి బోల్టు, నట్టును స్వయంగా రూపొందించి తయారు చేసిన నాసాకు భిన్నంగా, ఇస్రో ఎప్పుడూ ప్రైవేటు రంగంతో (వాల్‌చంద్‌నగర్, ఎల్ అండ్ టీ వంటివి) తయారీ సంబంధాన్ని కొనసాగిస్తూనే వచ్చింది. అయితే, ఇప్పుడు వస్తున్న మార్పు ఏమిటంటే, అనుభవం ఆధారంగా బలపడుతున్న స్థాపిత కంపెనీల గురించి కాదు, ఉపగ్రహ డేటాను సేవగా అందించడంపైనే ఎక్కువ ఆసక్తి చూపే, తాత్కాలిక విదేశీ మూలధనంతో వచ్చే కొత్త సంస్థల గురించి చర్చ జరుగుతోంది. ఏ రంగమూ స్థిరంగా ఉంటుందని ఆశించలేం. మనుగడ సాధించాలంటే, పనిచేసే విధానంలో గణనీయమైన మార్పులు అవసరం కావొచ్చు.

చైనా అంతరిక్ష కార్యక్రమం శక్తిపై ఇంకా ఎలాంటి తీవ్రమైన అంచనా జరగలేదు. 2035 నాటికి భారత అంతరిక్ష రంగం ఎగుమతి ఆదాయాలకు మూలంగా, ఉద్యోగాలను తీసుకొచ్చే, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని ఇముడ్చుకునే విలువ ఆధారిత సేవల కేంద్రంగా గుర్తింపు పొందాలంటే, ఇవాళ తీసుకునే కఠిన నిర్ణయాలు విలువైనవే కావొచ్చు. అయితే, బిలియనీర్ల సైన్స్ ఫిక్షన్ కల్పనలకు ఇంధనంగా, వలసవాద ఆక్రమణ భావనలకు, తప్పుడు 'ప్రత్యేక' క్లబ్ భావనకు అనుగుణంగా ఉండటానికి అంతరిక్షాన్ని బలిపెడుతూ ఈ ఉద్యమంలోకి దూకడం మాత్రం అవివేకమే. ఇస్రో దీన్ని స్పష్టంగా వివరించే పారదర్శక విధానాన్ని కలిగి ఉండాలి. తొమ్మిది ఉద్యోగ సంఘాలు కోరుతున్నట్టు, ఏవైనా తిరుగులేని నిర్ణయాలు తీసుకునేముందు సర్వీసు సంఘాలతో సంప్రదింపులు జరపాలని, ఇప్పటికే ఉన్న ఉద్యోగుల ప్రమోషన్ అవకాశాలకు, హోదాకు రక్షణ కల్పించాలని, ప్రజాధనంతో సృష్టించిన సాంకేతికత, సదుపాయాలు, ప్రయోగ కేంద్రాలను ప్రైవేటు నిర్వహణకు బదిలీ చేసే సంస్థాగత ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని కోరడం సహేతుకమైన డిమాండే. ప్రభుత్వం ఒక కాలపరిమితితో కూడిన, రాతపూర్వక వివరణను వెంటనే విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఉద్యోగుల ఆందోళనలను తగ్గించడానికే కాదు, భారత అంతరిక్ష రంగం దీర్ఘకాలిక వృద్ధికి అవసరమైన స్పష్టత, స్థిరత్వాన్ని నెలకొల్పడానికి కూడా అత్యవసరం! ■

## పనికొచ్చే పలుకు



# 'సేఫ్ జోన్'ను వదిలితేనే..!

ఓటమి భయం చాలామందిని ఉన్నచోటే కట్టేస్తుంది. అయితే ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఓడిపోయిన సందర్భాల కంటే అస్సలు ప్రయత్నించని విషయాలే మనుషులను ఎక్కువగా కలచివేస్తాయి. దరఖాస్తు చేయని ఉద్యోగం, వెళ్లని ప్రదేశం, ప్రారంభించని వ్యాపారం, వాయిదా వేసిన సంభాషణ.. ఇలా చేయకుండా వదిలేసిన పనులే భవిష్యత్తులో పెద్ద విచారంగా మారతాయి. చర్యకు, విచారానికి మధ్య ఉండే ఈ ఘర్షణనే ఒక ప్రసిద్ధ సూక్తి ఎంతో అద్భుతంగా ఆవిష్కరించింది.

"ఇప్పటి నుంచి ఇరవై ఏళ్ల తర్వాత, మీరు చేసిన పనులకంటే చేయని పనుల గురించే ఎక్కువ బాధపడతారు. కాబట్టి మీ నౌక తాళ్లను విప్పేయండి. సురక్షిత తీరంనుంచి అవతలివైపు ప్రయాణించండి. మీ తెరచాపలకు గాలులను పట్టుకోండి. అన్వేషించండి. కలలు కనండి. కనుగొనండి" ఈ మాటలు ధైర్యంగా అడుగు ముందుకు వేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక మంత్రంలా మారాయి. ఈ ప్రసిద్ధ వ్యాఖ్యానం అమెరికన్ ప్రముఖ రచయిత మార్క్ ట్వైన్‌దేనని ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలో ఉంది. అయితే అధ్యయనవేత్తలు, పరిశోధకులు ఒక ఆసక్తికరమైన విషయాన్ని తేల్చారు. మార్క్ ట్వైన్ ఈ మాటలు రాసినట్టు లేదా చెప్పినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేశారు. 'సెంటర్ ఫర్ మార్క్ ట్వైన్ స్టడీస్' కూడా దీనిని మార్క్ ట్వైన్ పేరిట ప్రచారంలో ఉన్న తప్పుడు సూక్తిగా వర్గీకరించింది.

ఆధారాల ప్రకారం, ఈ వాక్యాలు తొలిసారిగా హెచ్ జాక్సన్ బ్రౌన్ జూనియర్ 1990లో ప్రచురించిన 'పీ.ఎస్.. ఐ లవ్ యూ' అనే పుస్తకంలో కనిపించాయి. ఆయన తన తల్లి సారా ఫ్రాన్సెస్ బ్రౌన్ చెప్పిన మాటలుగా దీనిని ఆ పుస్తకంలో నమోదు చేశారు.

'సురక్షిత తీరం' రూపకం వెనుక అంతరార్థం


రచయిత ఎవరైనా సరే, ఈ వ్యాఖ్యలోని భావం మాత్రం ఎంతో శక్తిమంతమైనది. ఓడకు తీరం (హార్బర్) రక్షణనిస్తుంది. తుఫానుల నుంచి కాపాడుతుంది. కానీ ఓడ ఉన్నది తీరంలోనే ఉండిపోవడానికి కాదు. అనిశ్చితికి భయపడి ఒడ్డునే ఉండిపోతే, సముద్రం అవతల ఉన్న కొత్త ప్రపంచాన్ని ఎప్పటికీ చూడలేం.

ఈ వ్యాఖ్యానం గుడ్డిగా ప్రమాదాల్లోకి దూకమని చెప్పడం లేదు. కేవలం అనిశ్చితికి భయపడి ఏ నిర్ణయం తీసుకోకుండా ఉండిపోవడాన్ని ప్రశ్నిస్తోంది. జాగ్రత్తగా ఉండటం మంచిదే, కానీ ఆ జాగ్రత్త భయంగా మారి పురోగతిని ఆపకూడదనేది దీని ఉద్దేశం.

ప్రయత్నించి ఓడిపోవడమే మేలు

ఏదైనా ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు వెంటనే వచ్చే పరిణామాల గురించే ఆలోచిస్తాం. ఒక ఉద్యోగం మారితే ఏమవుతుందో, కొత్త వ్యాపారం దెబ్బతింటుందో అనే భయం ఉంటుంది. కానీ సురక్షితమైన మార్గంలో వెళ్లడం సౌకర్యంగానే ఉన్నా, అది పూర్తి తృప్తిని ఇవ్వదు.

ఒకవేళ ప్రయత్నించి విఫలమైతే, అందులో ఒక స్పష్టత వస్తుంది. ఒక పాఠం నేర్చుకుంటాం. కానీ అస్సలు ప్రయత్నించకపోతే "ఒకవేళ ప్రయత్నించి ఉంటే ఏం జరిగేది?" అనే ప్రశ్నకు ఎప్పటికీ సమాధానం దొరకదు. ఈ వ్యాఖ్య చివర్లో ఉన్న "అన్వేషించండి.. కలలు కనండి.. కనుగొనండి" అనే మూడు పదాలు ప్రయాణాన్ని సూచిస్తాయి. భయం మన జాగ్రత్తను దాటి మనల్ని కట్టడి చేస్తున్నప్పుడు, ఈ మాటలు మనల్ని ముందుకు నడిపిస్తాయి.



రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమిస్తే.. ఉదయం తొందరగా మేల్కోవడం కష్టమేమీ అనిపించదు. ఇంట్లోకి జంక్ఫుడ్ తెచ్చుకోకుంటే.. ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం దానంతటదే అలవాటవుతుంది. అనవసర ఖర్చులను తగ్గించుకుంటే.. పెట్టుబడుల కోసం డబ్బు మిగులుతుంది. జీవితంలో గెలవాలంటే మీరు గొప్ప మేధావి అయ్యుండాల్సిన అవసరం లేదు.. రోజువారీ నిర్ణయాలను మెరుగ్గా తీసుకుంటే చాలు! ఎక్కడైనా.. ఎప్పుడైనా.. పొదుపు ఆలోచన చాలా చిన్నదే కావొచ్చు. కాని ఫలితం మాత్రం ఊహించలేనంతే ఉంటుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# గోతులు తవ్వడానికి పోటీ



హంగేరిలో సమాధి తవ్వకంపై నిర్వహించిన వింత పోటీ అందరినీ ఆశ్చర్యపరిచింది. హంగేరియన్ శ్మశాన నిర్వహణ సంఘం, ఈ వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, మరణానికి సంబంధించిన నిషిద్ధ భావాలను తొలగించడానికి ఈ పోటీ నిర్వహించింది. ఉత్తర హంగేరీలోని ఓ శ్మశానంలో 19 ద్విసభ్య జట్లు వేగంగా, అందంగా సమాధి తవ్వడంలో పోటీపడ్డాయి. "వేగమే ఇక్కడ ప్రధానం, అందం కాదు" అని విజేత రాబర్ట్ నాజీ చెప్పగా, "నిజమైన అంత్యక్రియల కోసం తవ్వేటప్పుడు మాత్రం ఖచ్చితమైన కొలతలు, అందమైన ఆకృతిపైనే ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని ఆయన వివరించారు. 1.6 మీటర్ల లోతు, 2 మీటర్ల పొడవు, 0.8 మీటర్ల వెడల్పుతో సమాధి తవ్వాల్సిన నిబంధనను కేవలం గంటా 21 నిమిషాల్లో పూర్తి చేసిన నాజీ, లాస్లో కిస్ జోడీ, 2 లక్షల ఫోరింట్ల (సుమారు రూ.56,000) నగదు బహుమతి గెలుచుకుంది!

## పీఎంఓఎస్ ప్రభావం శరీరమంతటా



పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఒవేరియన్ సింధ్రోమ్ (పీఎంఓఎస్) ఒక్క అండాశయ తిత్తులకే పరిమితం కాదు. శరీరం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ఒకప్పుడు పీసీఓఎస్‌గా పిలుచుకునే ఇది హార్మోన్లు, జీవక్రియలతో ముడిపడిన సమస్య. రుతుక్రమం, సంతాన సమస్యలతో పాటు మధుమేహం వంటి దీర్ఘకాల జబ్బుల ముప్పు పెరిగేలా చేస్తుంది.

ఆ తిత్తులు అపరిపక్వ అండాలే

పీఎంఓఎస్ అనగానే చాలామంది తిత్తుల (సిస్ట్స్) గురించే ఆందోళన చెందుతుంటారు. నిజానికిది అండాశయాలు అవసరానికి మించి హార్మోన్లను విడుదల చేయటం వల్ల తలెత్తే సమస్య. ఇందులో మెదడు, అండాశయాల్లో పుట్టుకొచ్చే హార్మోన్ల మధ్య పరస్పర సంబంధం కీలకపాత్ర పోషిస్తుంది. ముందుగా మెదడులోని హైపోథలమస్ నుంచి విడుదలయ్యే గొనడోట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్ పీయూషగ్రంథిని ప్రేరేపిస్తుంది. అప్పుడు ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ పుట్టుకొచ్చి, అండాశయాలను ఉత్తేజితం చేస్తుంది. దీంతో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు తయారవుతాయి. ఈస్ట్రోజన్ ఒక స్థాయికి చేరుకోగానే పీయూషగ్రంథి ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసి, అండం విడుదలను ప్రేరేపిస్తుంది. ఈస్ట్రోజన్ మరీ ఎక్కువగా ఉత్పత్తి అయితే హార్మోన్ల సమాచార వ్యవస్థ కుంటుపడుతుంది. ల్యూటినైజింగ్ హార్మోన్ పెరిగితే టెస్టోస్టిరాన్ వంటి మగ హార్మోన్ల మోతాదులు ఎక్కువవుతాయి. ఇవి అండాశయాల్లో అండాలు పరిపక్వమవటాన్ని, విడుదల కావటాన్ని అడ్డుకుంటాయి. ఇలా పరిపక్వం కాని అండాలే బుడిపెలు బుడిపెలుగా.. నీటి తిత్తుల్లా కనిపిస్తాయి. అయితే పీఎంఓఎస్ గల అందరిలోనూ తిత్తులు ఉండాలనేమీ లేదు.

### ఇతర సమస్యలూ..

పీఎంఓఎస్ గల అందరిలో తిత్తులు ఉండకపోవచ్చు. వీరిలో మగ హార్మోన్లు పెరగటం (హైపర్‌ఆండ్రోజెనీమియా), రుతుక్రమం అస్తవ్యస్తం కావటం (ఓలిగోమెనోరియా), అండం విడుదల కాకపోవటం (అనావ్యులేషన్) వంటి సమస్యలూ కనిపిస్తుంటాయి. వీటి తీరును బట్టి పీఎంఓఎస్‌ను నాలుగు రకాలుగా (ఎ, బి, సి, డి) చెప్పుకోవచ్చు. . ఎ రకంలో మగ హార్మోన్లు ఎక్కువగా ఉండటం, నెలసరి సరిగా అవకపోవటం, అండాశయాల మీద తిత్తులు అన్నీ ఉంటాయి. రక్తపోటు, బరువు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి.

బి రకంలో తిత్తులు స్పష్టంగా ఉండవు. మగ హార్మోన్లు పెరుగుతాయి, అండం విడుదల కాదు.

సి రకంలో అండం బాగానే విడుదలవుతుంది గానీ మగ హార్మోన్లు పెరుగుతాయి. తిత్తులు స్పష్టంగా ఉంటాయి. చాలావరకూ ఇది సంతాన పరీక్షల సమయంలో బయట పడుతుంటుంది.

డి రకంలో మగ హార్మోన్ల లక్షణాలేవీ ఉండవు. కానీ నెలసరి సరిగా రాదు. తిత్తులు తలెత్తుతాయి.

### నిర్ధారణ ఇలా

చాలావరకూ లక్షణాలను బట్టే పీఎంఓఎస్‌ను అంచనా వేస్తారు. హార్మోన్లు, గ్లూకోజు మోతాదులు తెలుసుకోవటానికి కొన్ని రక్త పరీక్షలు అవసరమవుతాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లో తిత్తులు స్పష్టంగా కనిపిస్తాయి. ఇవి 2-9 మి.మీ. సైజులో 20 కన్నా ఎక్కువగా ఉంటే సమస్యగా నిర్ధారిస్తారు. అయితే రజస్వల అయ్యాక 18 ఏళ్లు వచ్చేంతవరకూ నిర్ధారించటం తగదు.

### ఇన్సులిన్ నిరోధకతతోనే..

పీఎంఓఎస్ ఇబ్బందులకు ప్రధాన కారణం కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించక పోవటం (ఇన్సులిన్ నిరోధకత). దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇలా కణాలు ఇన్సులిన్‌కు స్పందించనప్పుడు శరీరం మరింత ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇది అండాశయ హార్మోన్ల ఉత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. మగ హార్మోన్ల ఉత్పత్తీ ప్రేరేపితమవుతుంది. ఇన్సులిన్ నిరోధకత బరువు పెరగటానికీ దారితీస్తుంది. మరోవైపు బరువు పెరగటమూ ఇన్సులిన్ నిరోధకతకు కారణమవుతుంది. దీని మూలంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు క్రమంగా పెరుగుతూ, మధుమేహం తలెత్తే అవకాశముంది.

ఒక్క మధుమేహం ముప్పే కాదు.. అధిక బరువు, ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొలెస్ట్రాల్ పెరగటం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశమూ పెరుగుతుంది.

### జీవనశైలితో అడ్డుకట్ట

నిజానికి పీఎంఓఎస్ తల్లి కడుపులో ఉండగానే నిర్దేశితమై ఉంటుంది. దీనికి రకరకాల జన్యువులు కారణమవుతుంటాయి. ఇవి ఉన్నా పీఎంఓఎస్ రావాలనేమీ లేదు. అతిగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి జన్యువులను ప్రేరేపించి సమస్యకు దారితీస్తుంటాయి. కాబట్టి జీవనశైలి మార్చుకోవటం చాలా ముఖ్యం. పొట్టలో కొవ్వు, బరువు తగ్గితే దాదాపు అన్ని సమస్యలూ తగ్గుతాయి. అందువల్ల క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, సమతులాహారం తినటం వంటి జీవనశైలి మార్పులతో బరువు తగ్గించుకోవాలి.

లక్షణాలు.. ఇబ్బందులు

నెలసరి సమయానికి కాకపోవటం. కొందరికి రెండు మూడు నెలలైనా రాదు. ఒకవేళ వస్తే రుతుస్రావం ఆగదు. లేదా కొంచెం కొంచెం కనిపించొచ్చు.

బరువు పెరగటం, ఊబకాయం

గర్భధారణలో ఇబ్బంది

మొటిమలు

గడ్డం, మీసం, కాళ్లు, చేతుల వంటి భాగాల్లో వెంట్రుకలు మొలవటం

జుట్టు ఊడిపోవటం

మెడ చుట్టుపక్కల, చంకలు, గజ్జల్లో చర్మం నల్లబడటం

నిస్సత్తువ

మూడ్ మారటం

చర్మం మీద సన్న కాయల వంటివి మొలవటం

### మందుల మేలు

కాస్త చిన్నవయసు వారికి నెలసరి సక్రమంగా రావటానికి హార్మోన్ మాత్రలు ఉపయోగపడతాయి.

మధుమేహంలో వాడే మెట్‌ఫార్మిన్ ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి.

చిక్కుళ్లు, ధాన్యాలు, బాదం వంటి వాటిల్లో ఉండే ఇనోసిటాల్స్ మేలు చేస్తాయి. ఇన్సులిన్ నిరోధకత తగ్గటానికి, నెలసరి సమయానికి రావటానికి, అండాశయాలు సరిగా పనిచేయటానికి తోడ్పడతాయి. బరువూ తగ్గుతుంది. అవసరమైతే వీటిని మందుల రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది.

థైరాయిడ్ జబ్బు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలుంటే తగు చికిత్స అవసరం. కొందరికి మగ హార్మోన్ల ప్రభావాన్ని నిలువరించే మందులు అవసరమవుతాయి.

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

## చేపలు, కోడిగుడ్లు మంచివి

## క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

## వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



### చేపలు

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

### బాదం గింజలు

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

### గుడ్లు

కోడి గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది. లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు.

నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి

పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి

స్ట్రెచింగ్ వ్యాయామాలతో నూ మంచి ఫలితాలు



# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

### బాదం గింజలు

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది.

అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

### నిమ్మరసం కలిపిన నీరు

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే నిమ్మరసం కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

### వ్యాయామం

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

## ఆసియా కప్ ట్రోఫీ వద్దు.. భారత్‌ను ఓడించాలన్న పాక్ అభిమాని.. టీమిండియా ఫ్యాన్స్ కౌంటర్

- సోషల్ మీడియాలో పాక్ ఫ్యాన్ వీడియో వైరల్
- కౌంటర్లు ఇస్తున్న టీమిండియా ఫ్యాన్స్
- మహిళల ఆసియా కప్‌లో సెమీస్‌కు చేరిన భారత్, పాకిస్థాన్
- సెమీస్‌లో గెలిస్తే ఫైనల్లో మరోసారి దాయాదుల పోరుకు అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్ 2026 టోర్నీ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన ఓ అభిమాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై భారత క్రికెట్ అభిమానులు తమదైన శైలిలో ధీటుగా బదులిస్తున్నారు. దుబాయ్ వేదికగా హాంగ్‌కాంగ్‌తో జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన పాకిస్థాన్ మహిళల జట్టు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది.
ఈ మ్యాచ్ అనంతరం పాక్ జట్టు హెడ్ కోచ్ వహాబ్ రియాజ్‌తో ఓ అభిమాని మాట్లాడుతూ, "మాకు ఆసియా కప్ ట్రోఫీ అవసరం లేదు, భారత జట్టును ఓడిస్తే చాలు" అని కోరాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు ఘాటుగా స్పందిస్తున్నారు. "వారు క్రికెట్‌ను యుద్ధంలా, యుద్ధాన్ని ఆటలా పరిగణిస్తారు. కానీ రెండు చోట్లా వారికి ఓటమి తప్పదు" అని ఒకరు వ్యాఖ్యానించగా, "మొన్నటి ఓటమి షాక్ ఇంకా సరిపోలేదా? ఫైనల్‌కు రండి, ఈసారి టీమిండియా అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతుంది" అంటూ మరొక అభిమాని ఎద్దేవా చేశాడు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. సెప్టెంబర్ 10న జరగనున్న సెమీస్‌లో బంగ్లాదేశ్ లేదా యూఏఈ విజేతతో భారత్ తలపడనుంది. మరో సెమీ ఫైనల్‌లో పాకిస్థాన్ జట్టు శ్రీలంకను ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచుల్లోనూ భారత్, పాకిస్థాన్ విజయం సాధిస్తే, సెప్టెంబర్ 13న జరిగే ఫైనల్‌లో దాయాదుల మధ్య మరో హై వోల్టేజ్ పోరు ఖాయం కానుంది.

# అలాంటప్పుడే నా బెస్ట్ గేమ్ బయటకొస్తుంది.. ఇషాన్ కిషన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ 270 పరుగులు
- దులీప్ ట్రోఫీలో ఎనిమిదో అత్యధిక వ్యక్తిగత స్కోరు
- ఒత్తిడిలోనే తన బెస్ట్ గేమ్ బయటకు వస్తుందన్న కిషన్
- జట్టు లక్ష్యాలను చిన్న భాగాలుగా చేసుకుని ఆడినట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి పెరిగినప్పుడే తనలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుందని భారత బ్యాటర్, ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన తర్వాత అతడు తన ఆటతీరుపై ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కిషన్ 334 బంతుల్లో 270 పరుగులు చేశాడు. ఇందులో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడి ఇన్నింగ్స్‌తో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ల జాబితాలో కిషన్ 270 పరుగులు ఎనిమిదో స్థానంలో నిలిచాయి. పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడి తన ఆటకు మరింత ఉపయోగపడుతుందని కిషన్ చెప్పాడు. వికెట్లు త్వరగా పడిపోయిన సందర్భాల్లో కూడా తాను బ్యాటింగ్‌ను ఆస్వాదిస్తానన్నాడు. ప్రశాంతంగా ఉంటూనే దూకుడుగా ఆడటం తనకు బాగా కలిసొస్తుందని వివరించాడు. తన వ్యక్తిగత స్కోరుపై కాకుండా జట్టు లక్ష్యంపై దృష్టి పెట్టినట్లు కిషన్ తెలిపాడు. 400 పరుగులు పూర్తయితే ముందుగా 450కి చేరుకోవాలని.. తర్వాత 500 పరుగుల లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పాడు. ఇలా చిన్న చిన్న లక్ష్యాలుగా విడగొట్టుకోవడం వల్లే సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగలిగానన్నాడు. చెపాక్‌లో పరిస్థితులు బ్యాటర్లకు అంత సులభంగా లేవని కిషన్ చెప్పాడు. మైదానం ఒకవైపు బౌండరీ చాలా దూరంగా ఉండటంతో షాట్లకు ఎక్కువ శ్రమ పెట్టాల్సి వచ్చిందన్నాడు. బంతి మెత్తబడటంతో బౌండరీలు సాధించడం మరింత కష్టంగా మారిందని తెలిపాడు. మహ్మద్ సిరాజ్ షార్ట్ బాల్స్ వేసినప్పుడు వికెట్ కోల్పోకుండా ఉండేందుకు తన బ్యాటింగ్ భంగిమను మార్చుకున్నట్లు కిషన్ చెప్పాడు. బంతిని బలంగా కొట్టే ప్రయత్నంలో వికెట్ చేజారకుండా జాగ్రత్త పడ్డానన్నాడు. కుమార్ కుషాగ్రతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. కుషాగ్ర 132 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఆ తర్వాత కూడా కిషన్ అదే జోరును కొనసాగించాడు. 270 పరుగుల వద్ద లాంగ్‌ఆన్ సమీపంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ట్రిపుల్ సెంచరీకి అతడు 30 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. తన భారీ ఇన్నింగ్స్‌లో షాట్లు ఆడేందుకు పెద్దగా రిస్క్ తీసుకోలేదని కిషన్ చెప్పాడు. సరైన బంతులను ఎంచుకుని ఆడటం తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందన్నాడు.

## నా డబ్బులు ఎగ్గొట్టారు.. నన్ను ఘోరంగా అవమానించారు: పాక్ బోర్డుపై ఆస్ట్రేలియా దిగ్గజం హాట్ కామెంట్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆధిపత్య ధోరణి, అంతర్గత కుట్రలపై ఆస్ట్రేలియా బౌలింగ్ దిగ్గజం, పాక్ మాజీ టెస్టు కోచ్ జేసన్ గిలెస్పీ సంచలన ఆరోపణలు చేశారు. పాక్ జట్టుకు శిక్షణ ఇచ్చిన సమయంలో తనను ఘోరంగా అవమానించారని, టీమ్‌లో తన పాత్రను పూర్తిగా తీసిపారేసి కనీస గౌరవం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తనకు ఇవ్వాల్సిన వేల డాలర్ల జీతం డబ్బులని పీసీబీ ఇప్పటివరకు చెల్లించకుండా ఎగ్గొట్టిందని ఆరోపించాడు. బోర్డు చెప్పిన ప్రతిదానికీ తల ఊపేందుకు తాను సిద్ధం లేనన్నారు. తన సూత్రాలను విడిచిపెట్టే ప్రసక్తి లేదని కరాఖండిగా తేల్చిచెప్పారు.

**ఆకిబ్ జావేద్ వెన్నుపోటు పొడిచాడు:**
పీసీబీ చీఫ్ సెలెక్టర్‌గా ఆకిబ్ జావేద్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే తన పరిస్థితి దారుణంగా తయారైందని గిలెస్పీ ఆరోపించారు. నేను జట్టును నడిపించే స్థాయి నుంచి ఏ అధికారమూ లేనివాడిగా మిగిలిపోయాను.. ఆకిబ్ జావేద్ నా వెనుక ఉండి నాపై కుట్రలు చేశాడు.. మైండ్ గేమ్స్ ఆడుతూ నాపై నిరంతరం విషం కక్కాడు.. ఇప్పటికీ నా ప్రదర్శనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నాడు.. అతను నాపై నెగెటివ్‌గా మాట్లాడటం ఆపకపోతే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నాడు. అతడిపై కచ్చితంగా లీగల్ యాక్షన్ తీసుకుంటానని గిలెస్పీ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

**డిప్రెషన్‌లోకి నెట్టేశారు.. క్రికెట్ వదిలేయాలనుకున్నా:**
పాకిస్థాన్ బోర్డులో ఎదురైన ఈ చేదు అనుభవాలు తన మానసిక ప్రశాంతతను దెబ్బతీశాయని జేసన్ గిలెస్పీ స్పష్టం చేశారు. పీసీబీలోని నెగెటివ్ వాతావరణంతో తనపై తనకే అనుమానం వచ్చిందని, అసలు కోచింగ్ వృత్తిలోనే కొనసాగాలా వద్దా అనే తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. గ్యారీ కిర్‌స్టన్, తాను జట్టును నాశనం చేశామంటూ ఆకిబ్ జావేద్ నిందలు వేయడంపై మండిపడ్డారు. బోర్డు పెద్దల అండ చూసుకుని ఆకిబ్ విర్రవీగుతున్నాడని, ఇతరుల అభిప్రాయాలకు అక్కడ అస్సలు విలువ లేదని దుయ్యబట్టారు.

**ఆకిబ్ ఉన్నంత కాలం పాక్ క్రికెట్ నాశనమే:**
పాకిస్థాన్ క్రికెట్ రోజు రోజుకూ దిగజారిపోవడానికి ఆకిబ్ జావేదే ప్రధాన కారణమని గిలెస్పీ స్పష్టం చేశారు. ఆకిబ్ అక్కడ ఉన్నంత కాలం పాక్ క్రికెట్ ఎప్పటికీ ముందుకెళ్లదు, వెనక్కే పోతుంది. ఏసీ గదుల్లో కూర్చునే బోర్డు పెద్దలు మైదానంలో ఆడే కెప్టెన్లను ఎంపిక చేయడం ఏంటి? ఇది ముమ్మాటికీ మూర్ఖత్వం.. సరైన కోచ్‌ను నియమించి అతనికి పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే జట్టు బాగుపడుతుంది. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ ఒక పెద్ద గందరగోళంలో కూరుకుపోయిందని పాక్ క్రికెట్ పతనంపై జేసన్ గిలెస్పీ విశ్లేషించారు.

# పార్ట్ టైమ్ సేవింగ్స్.. రూ.100 కోట్ల సినిమా!







21 ఏళ్ల వయసులో మూడేళ్ల పాటు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసి దాచుకున్న డబ్బంతా ఒక సినిమాపై పెట్టడం చిన్న నిర్ణయం కాదు. అనుప్రియా నాగర్ మాత్రం అదే చేసింది. యూకేలో చదువుకుంటూ సంపాదించిన తన సేవింగ్స్‌ను హనుమాన్ అంష్ కోసం పెట్టింది. సినిమా నిర్మాణంలో అనుప్రియతో పాటు మరికొందరు నిర్మాతలు కూడా ఉన్నారు. ఇప్పుడు రూ.2 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా ఇండియాలో రూ.100 కోట్ల మార్క్ దాటింది. అసలు అనుప్రియకు సినిమా ఆలోచన కూడా విచిత్రంగానే వచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ బాత్‌లో ఎకనామిక్స్ చదువుతున్నప్పుడు స్టీవ్ జాబ్స్‌పై ఒక అసైన్‌మెంట్ చేసింది. అప్పుడే ఆయనకు నీమ్ కరోలి బాబాతో ఉన్న ఆధ్యాత్మిక కనెక్షన్ గురించి తెలిసింది. అక్కడి నుంచి నీమ్ కరోలి బాబా గురించి చదవడం మొదలుపెట్టి, చివరకు అదే విషయాన్ని సినిమా వరకు తీసుకొచ్చింది. చదువు పూర్తయ్యాక అనుప్రియకు జ్యూరిచ్‌లో ఉద్యోగం కూడా వచ్చింది. కానీ 2025లో ఇండియాకు తిరిగొచ్చి హనుమాన్ అంష్ నిర్మాణంలో భాగమైంది. అప్పటివరకు ఆమెకు సినిమా నిర్మాణంలో అనుభవం లేదు. అయినా యూకేలో మూడేళ్లు పార్ట్ టైమ్ పనులు చేసి దాచుకున్న సేవింగ్స్ మొత్తం ఈ ప్రాజెక్ట్‌లో పెట్టినట్టు అనుప్రియ స్వయంగా చెప్పింది.
విశాల్ చతుర్వేది దర్శకత్వంలో నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా హనుమాన్ అంష్ తెరకెక్కింది. మొదట సినిమా ప్రయాణం అంత ఈజీగా సాగలేదు. విడుదల తర్వాత ఒక దశలో స్క్రీన్స్ భారీగా తగ్గిపోయాయి. అక్కడి నుంచి మౌత్ టాక్ తో పరిస్థితి మారింది. మళ్లీ స్క్రీన్స్ పెరుగుతూ వెళ్లాయి. ఐదో వారానికి వచ్చేసరికి ఇండియా కలెక్షన్స్ రూ.100 కోట్లను దాటాయి. ప్రస్తుతం రూ.120 కోట్లకు పైగా నెట్ వచ్చినట్టు బాక్సాఫీస్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. అనుప్రియ మాత్రం తనకు కలెక్షన్స్ కంటే నీమ్ కరోలి బాబా గురించి యువత తెలుసుకోవడమే ముఖ్యమని చెబుతోంది. విదేశీయుల ద్వారా ఆయన గురించి మొదట తెలుసుకోవాల్సి రావడం తనకు బాధగా అనిపించిందని కూడా చెప్పింది. అందుకే ముఖ్యంగా యువతకు ఆయన కథ చేరాలనే ఉద్దేశంతో సినిమా చేసినట్టు తెలిపింది. హనుమాన్ అంష్‌కు ఇప్పుడు సీక్వెల్ కూడా రాబోతోంది. అయితే మొదటి సినిమా హిట్ అయిందని ఈసారి బడ్జెట్‌ను భారీగా పెంచే ఆలోచనలో లేరట. రూ.2 కోట్లలో చేసిన మొదటి సినిమాలో ఉన్న సింప్లిసిటీ, రా ఫీల్ అలాగే ఉండాలని అనుప్రియ చెబుతోంది. మొదటి సినిమా చివర్లోనే రెండో భాగానికి హింట్ ఇచ్చారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965